IN MEDIA PUBLICATION PVT LTD
NEWS
MV NEWS
మన మీ.. వార్త

@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మన మీ..
# వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
హైదరాబాద్
ఆదివారం 23 ఆగస్టు 2026
సంపుటి : 02
సంచిక :52
పేజీలు : 12 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## న్యాయసేతు అనేది ఒక వారధి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి



## విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

- ఇకపై 'ఈ-బోర్డింగ్ పాస్' ఉంటే చాలు!
- ఎయిర్‌పోర్టుల వద్ద బోర్డింగ్ పాస్‌పై కేంద్రం కీలక నిర్ణయం
- అంతర్జాతీయ విమాన ప్రయాణికులు ఇకపై ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తీసుకురావాల్సిన అవసరం లేదని వెల్లడి





## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బీజేపీ తీర్మానం
- జాతీయ గేయం చరిత్ర, వారసత్వంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామని పార్టీ వెల్లడి
- వందేమాతరం రెండు చరణాలే పాడుతామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఖండిస్తూ మరో తీర్మానానికి పార్టీ ఆమోదం



## మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

- ఓచోట 'డబుల్ డెక్', మరోచోట భూగర్భ మార్గం
- మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో పలు ప్రత్యేకతలు, సవాళ్లు
- హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మెట్రో మార్గం
- మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్

హైదరాబాద్

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ ప్రత్యేకతలు, సవాళ్లతో కూడుకున్నది. ఈ మార్గం సంక్లిష్టమైన రైల్వే క్రాసింగ్‌లు, ఫ్లైఓవర్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, విమానాశ్రయ ప్రాంగణాల గుండా వెళ్లాల్సి ఉంటుంది. జేబీఎస్? నుంచి శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం రన్‌వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు హెచ్ఎండీఏ ప్రణాళిక చేసిన హైవే టన్నెల్ వెంబడి 1.65 కి.మీ మేర భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అదేవిధంగా నాగోల్ - మిగతా3లో

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

- విద్య, పరిశోధన, స్టార్టప్‌లపై భారీ ప్లాన్!
- సీఎం రేవంత్ కీలక చర్చలు!
- లండన్ కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం



హైదరాబాద్

లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో - మిగతా3లో



## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

- ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు
- జస్టిస్ సంజయ్ కరోల్
- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'

- పండగ ముందు ప్రజలపై భారం'
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఫైర్
- చక్కెర ధరలను పెంపుపై ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్
- పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపణ



# కాంగ్రెస్‌లో పాత రోజులు

- కాంగ్రెస్‌లో పతాక స్థాయికి చేరిన కుమ్ములాటలు
- "అంతర్గత ప్రజాస్వామ్యం" అనే ముసుగులో నేతలు హద్దులు దాటి బహిరంగ విమర్శలకు దిగడం ఇప్పుడు గాంధీభవన్‌ను కుదిపేస్తోంది
- సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదు
- కాంగ్రెస్‌లో ఎప్పటినుంచో రగులుతున్న 'వలస నేతలు వర్సెస్ ఒరిజినల్ కాంగ్రెస్' వివాదానికి ఇది పరాకాష్ట
- ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం దక్కుతోందని, ఉద్యమ కాలం నుంచి పార్టీని మోసిన పాత తరం నేతలు, ముఖ్యంగా బీసీ నాయకత్వం క్రమంగా పక్కకు నెట్టివేయబడుతోందనే అసహనం
- సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదని, పార్టీ క్రమంగా 'టీడీపీ కాంగ్రెస్'గా మారుతోందంటూ వ్యాఖ్యలు

హైదరాబాద్

కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని చెప్పుకుంటూ ఉంటారు. అసంతృప్తి ప్రకటనలు చేసే వారికి ఈ పేరు పెట్టుకున్నారు. ఇప్పుడీ కాంగ్రెస్ మార్క్ అంతర్గత ప్రజాస్వామ్యం హద్దులు దాటి పోతోంది. రాజగోపాల్ రెడ్డి నిరంతరం వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. అనిరుధ్ రెడ్డితో పాటు ఇటీవల చిన్నారెడ్డి కూడా అదే చేశారు. తాజాగా సుస్మితా పటేల్ సంచలనం సృష్టించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర రాజకీయ కలకలాన్ని రేపాయి. సీఎం రేవంత్‌కు పార్టీ సిద్ధాంతాలు ఇంకా వంటబట్టలేదని, కాంగ్రెస్ క్రమంగా టీడీపీ కాంగ్రెస్ గా మారుతోందని ఆరోపిస్తూ ఆమె నేరుగా తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన ఒక కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ టికెట్ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. - మిగతా3లో



# గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం



- ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి
- అలాంటి నిర్మాణాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్
- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో కూలిన భవనం
- ఏడంతస్తుల భవనం కూలి పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడిన శిథిలాలు
- శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది
- పరిశీలించిన హైడ్రా కమిషనర్

# న్యాయసేతు అనేది ఒక వారధి



స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు మానవాళిలో 40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం దిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "చట్టబద్ధమైన పాలన గురించి నేను ఒక పదాన్ని ఉదహరిస్తున్నాను. అదే న్యాయనమిక్స్. మరింత సరళంగా చెప్పాలంటే న్యాయ ఆర్థిక శాస్త్రం. ఈ న్యాయనామిక్స్ బ్రిక్స్ ప్లస్ దేశాలన్నింటికీ వర్తిస్తుంది. కేసులను డిజిటలైజ్ చేయడంలో భారతదేశానికి ఉన్న అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక ఉమ్మడి భాండాగారాన్ని ఏర్పాటు చేయాలి. తద్వారా బ్రిక్స్ ప్లస్ దేశాల అధికార పరిధిలో వెలువడిన తీర్పు, అదే విధమైన చట్టపరమైన ప్రశ్నలతో వ్యవహరించే ఇతర ప్రాంతాలలోని న్యాయస్థానాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. తద్వారా దిల్లీ, బ్రసీలియాలో రాసిన తీర్పు అదే ప్రశ్నను ఎదుర్కొంటున్న మరోచోట ఉన్న ధర్మాసనానికి తెలియజేయడానికి సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదు. 'న్యాయ సేతు' అనేది 11 న్యాయ సంప్రదాయాలను అనుసంధానించే ఒక వారధి."

**'బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది'**

బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు. "బ్రిక్స్ న్యాయ వేదికను స్థాపించడం, అభివృద్ధి చేయడం చాలా అవసరం. ఇలా చేస్తే సమస్యలను సమష్టిగా పరిశీలించడానికి, ఒకరి న్యాయ వ్యవస్థలను మరొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి, అలాగే మన దేశాల మధ్య ఉన్న వివాదాలకు పరిష్కారాన్ని ఎలా సరళంగా, మరింత ప్రభావవంతంగా కనుక్కోవచ్చో అన్వేషించడానికి ఒక అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ మారుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని దిల్లీలో ఒక బ్రిక్స్ మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చొరవ తీసుకుంది."

**భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు**

2012, 2016, 2021లలో భారత్ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించింది. 2026లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ న్యాయ ప్రముఖుల నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఇండియా బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. 2025లో ఇండోనేసియా కూడా బ్రిక్స్ కూటమిలో భాగమైంది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్య 11కు చేరుకుంది.

# విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్



సెప్టెంబర్ 1 నుంచి భారత విమానాశ్రయాల నుంచి బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికులు తమ బోర్డింగ్ పాస్‌లపై ఇమ్మిగ్రేషన్ అధికారులతో భౌతికంగా స్టాంప్ వేయించుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. స్టాంపింగ్‌కు బదులుగా విదేశాలకు ప్రయాణించే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఈ-బోర్డింగ్ పాస్‌ను చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయితే ప్రయాణికులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను తీసుకురావొచ్చని, కానీ ఇమ్మిగ్రేషన్ అధికారులు వాటిపై స్టాంప్ వేయరని పేర్కొంది. ఈ మేరకు సంబంధిత అధికారులు వెల్లడించారు.

**ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని!**

ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లు సమర్పించే విషయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోందని, ఒక్కోసారి స్టాంపింగ్ తప్పిదాల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ తెలియజేయడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు తెలిపారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలలో భౌతిక బోర్డింగ్ పాస్‌ల తప్పనిసరి అవసరాన్ని, ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్‌ను తొలగించాలని కేంద్రం తాజాగా నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రయాణికుల తనిఖీ సమయంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయదని స్పష్టం చేశారు. వాటిని కేవలం ఇమిగ్రేషన్ అధికారుల క్లియరెన్స్ కోసం మాత్రమే చూపించాల్సి ఉంటుందని వెల్లడించారు. భారత పాస్‌పోర్ట్ ఉన్న పౌరులకు కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్ తొలగింపు విషయంలో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు వివరించారు.

**కేంద్ర సర్కార్ కొత్త రూల్స్ ప్రకారం**

భారత్ నుంచి బయలుదేరే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సమయంలో తమ స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న ఈ-బోర్డింగ్ పాస్‌లను చూపించవచ్చు. అలా అని ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను కలిగి ఉన్న ప్రయాణికులకు బోర్డింగ్ క్లియరెన్స్‌ను ఇస్తారు. అయితే సెప్టెంబర్ 1 నుంచి ఇమ్మిగ్రేషన్ అధికారులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయరు. కాగా, సీఐఎస్ఎఫ్ కొన్నేళ్ల క్రితమే దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయడాన్ని ఆపేసింది.

**మరో కీలక చర్యకు సిద్ధమవుతోందా?**

అలాగే అంతర్జాతీయ ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ మరో కీలక చర్యకు రెడీ అవుతోంది. భారతీయ పాస్‌పోర్ట్ కలిగిన ప్రయాణికుల రాకపోకల సమయంలో పాస్‌పోర్ట్‌లపై స్టాంపింగ్ వేసే విధానాన్ని కూడా పూర్తిగా తొలగించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి త్వరలోనే ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, ఆ తర్వాత దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అమలు చేయనుంది.

**పాస్‌పోర్టు ఫీజుల పెంపు**

కాగా, పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంపు చేసింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేల ఫీజు కాగా, ఇక నుంచి రూ.3500 వసూలు చేయనుంది. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించింది. 18 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా, అది రూ.1750కి పెరిగింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత పాస్‌పోర్ట్ ఫీజులు పెరిగాయి.

**ఇండియా పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే : కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం**

భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని కేంద్ర విదేశాంగ శాఖ ఇటీవలే స్పష్టం చేసింది. గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని పేర్కొంది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంపై అప్పట్లో మోదీ ప్రభుత్వంపై విపక్షాలు భగ్గుమన్నాయి.

# వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు



వందేమాతరం విషయంలో కాంగ్రెస్ "బుజ్జగింపు రాజకీయాలకు" పాల్పడుతోందని బీజేపీ శనివారం ఆరోపించింది. రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. దిల్లీలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బీజేపీ పేర్కొంది.

ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని "స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని నబీన్ వివరించారు.

"2026 ఆగస్టు 22న వందేమాతరం పట్ల గౌరవం, దాని చారిత్రక వారసత్వ పరిరక్షణకు సంబంధించి ఒక ముఖ్యమైన తీర్మానాన్ని భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరం గీతాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చేస్తూ 1937లో తీసుకున్న నిర్ణయాన్ని పునరుద్ధాటిస్తూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగస్టు 19, 2026న తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజకీయ ప్రయోజనాలు లేదా బుజ్జగింపుల కోసం వందేమాతరం గౌరవం, వారసత్వం విషయంలో ఎటువంటి రాజీని అంగీకరించబోము. వందేమాతరం సంపూర్ణ గేయ గౌరవం, హుందాతనం, వారసత్వం, జాతీయ స్ఫూర్తిని బీజేపీ కాపాడుతుంది. అలాగే, వందేమాతరాన్ని అత్యంత స్వచ్ఛమైన జాతీయ భావనతో ముడిపడి ఉన్న "సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదం"గా అభివర్ణిస్తూ మహాత్మా గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్తుంది. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాముఖ్యత, వారసత్వాన్ని భారతదేశంలోని ప్రతి మూలకు చేరవేసేందుకు బీజేపీ ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. అంతేకాకుండా, వందేమాతరం ఆలపించడంపై ఆంక్షలు విధించిన చారిత్రక, రాజకీయ పరిస్థితులను అంటే ముస్లిం లీగ్ అభ్యంతరాలు, తదనంతరం పెరిగిన మతపరమైన, వేర్పాటువాద డిమాండ్ల రాజకీయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నిర్ణయించింది. 1947లో భారతదేశ స్వాతంత్ర్య విజయ నినాదం 'వందేమాతరం'. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటి 'అభివృద్ధి చెందిన భారతదేశం' (వికసిత్ భారత్) గొప్ప ప్రకటనకు కూడా 'వందేమాతరం' నినాదమే కానుంది."

కాంగ్రెస్ పార్టీ లేదా దాని వర్కింగ్ కమిటీ గానీ తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర అన్నారు. "ఈ రోజు నేను దేశాన్ని అడగదలుచుకున్నాను. పార్లమెంట్ గొప్పదా లేక జఔజ గొప్పదా? దేశం పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా నడుస్తుందా లేక జఔజ ఆమోదించిన నిర్ణయాలు, తీర్మానాల ఆధారంగా నడుస్తుందా? ఏ కుటుంబం, ఏ రాజకీయ పార్టీ, ఏ వ్యక్తి కూడా దేశ చట్టం, దేశ రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే తాము గొప్పవారమని భావించకూడదు. జఔజ తన కార్యాలయంలో కూర్చుని, తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి అత్యున్నత దేవాలయం. పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయమే దేశ నిర్ణయం. వందేమాతరం దేశ గేయం. అది దేశ మంత్రం. హిందువులు, ముస్లింల మధ్య విభజన సృష్టించడానికి ఇది ఒక సాధనం కాదు. కాంగ్రెస్ విభజన బీజాలు నాటడానికి ప్రయత్నిస్తోంది. దీన్ని మేము జరగనివ్వము." అని సంబిత్ పాత్ర అన్నారు.

## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

'న్యాయమూర్తులు దేవుళ్ల కాదు. ప్రతి తీర్పునూ కచ్చితంగా సరైనదిగా ఇవ్వలేం' అని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ అన్నారు. న్యాయవ్యవస్థలో వినయం, బాధ్యత, మానవీయ కోణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శనివారం సుప్రీంకోర్టులో తన చివరి పని రోజున ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కీలక వ్యాఖ్యలు చేశారు. 'రాజ్యాంగం, న్యాయమూర్తులు కేవలం చట్టాన్ని సరిగ్గా వర్తింపజేయాలని మాత్రమే కోరడం లేదు. చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తిని కేవలం పిటిషనర్‌గా కాకుండా ఒక మనిషిగా చూడాల్సిన అవసరం ఉంది. ఒక పిటిషన్ కేసుకు సంబంధించిన వాస్తవాలను మాత్రమే చెబుతుంది. కానీ కోర్టును ఆశ్రయించిన వ్యక్తి ఇప్పటికే ఏం కోల్పోయాడు? తనకు కోర్టు నుంచి ఏం ఆశిస్తున్నాడు? వంటి విషయాలను అది చెప్పదు. అందుకే న్యాయమూర్తికి వినయం అవసరం' అని జస్టిస్ కరోల్ తెలిపారు.

**'కోర్టులో మాటలే కాదు, మౌనం కూడా ముఖ్యం'**

దాదాపు నాలుగు దశాబ్దాల తన న్యాయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు జస్టిస్ కరోల్. సుమారు 40 ఏళ్లపాటు కోర్టు గదుల్లో గడిపినట్లు తెలిపారు. తొలుత న్యాయవాదిగా, ఆ తర్వాత 19 ఏళ్లపాటు న్యాయమూర్తిగా సేవలందించానని చెప్పారు. కోర్టులో వినిపించే వాదనలతో పాటు మౌనంలో దాగి ఉన్న మాటలను కూడా న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలని అన్నారు. న్యాయ ప్రక్రియలో న్యాయవాదులు చేసే వాదనలే కాకుండా, మాటల మధ్యలో బాధితులు కోరుకునేది ఏమిటో గుర్తించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. 1996లో తొలిసారి సుప్రీంకోర్టు మొదటి నంబర్ కోర్టులోకి వెళ్లిన గుర్తు చేస్తూ, అప్పట్లో న్యాయమూర్తుల బెంచ్ దాదాపు ఆరు అడుగుల ఎత్తులో ఉన్నట్లు తనకు అనిపించిందన్నారు. కింద నుంచి చూస్తే ఆ ఎత్తు అధికారానికి ప్రతీకగా కనిపించవచ్చని, కానీ న్యాయమూర్తిగా ఆ స్థానంలో కూర్చున్నప్పుడు అది గౌరవం, నిజాయితీతో కూడిన బాధ్యతకు ప్రతీక అని అర్థమైందన్నారు.

**సాధారణ పౌరుడి విశ్వాసమే సుప్రీంకోర్టు బలం**

సుప్రీంకోర్టు గొప్పతనం కేవలం కీలకమైన కేసుల్లో వెలువడే తీర్పుల్లో లేదని జస్టిస్ కరోల్ అన్నారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతో కోర్టు గడప తొక్కే సాధారణ పౌరుడి విశ్వాసమే దాని అసలైన బలమని పేర్కొన్నారు. అయితే న్యాయం చాలా దూరంగా ఉందని, ఖరీదైనదని లేదా భయపెట్టేదిగా భావించి కోర్టుల గడప తొక్కలేని వారిని కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం, న్యాయ ప్రక్రియ, రాజ్యాంగబద్ధత వంటి భావనలను అర్థం చేసుకోవడానికి ధర్మం అనే భావనను ఉదాహరణగా తీసుకోవచ్చని జస్టిస్ కరోల్ అన్నారు. ఇక్కడ ధర్మం అంటే ఆచారం కాదని, విధి, బాధ్యత అని వివరించారు. కోర్టు ముందు నిలబడే వ్యక్తి ఎంత చిన్నవాడైనా, ఎంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నా అతడి మాటను న్యాయమూర్తి వినాలని చెప్పారు. న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరించడమే న్యాయమూర్తి ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

**'ప్రతి ఒక్కరూ తమ నిర్ణయాలకు న్యాయమూర్తులే'**

న్యాయవ్యవస్థలోని బాధ్యతలు కేవలం కోర్టు గదులకే పరిమితం కావని జస్టిస్ కరోల్ అన్నారు. ప్రతి వ్యక్తి తన నిర్ణయాలు, ప్రవర్తన, అధికార వినియోగంపై తానే న్యాయమూర్తిగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. 'న్యాయమూర్తి వస్త్రాలు ధరించే ముందు కూడా న్యాయమూర్తే. వాటిని తొలగించిన తర్వాత కూడా న్యాయమూర్తే' అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్?కు కేవలం ఒక రాజ్యాంగం ఉండటమే కాదు, దానిని మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని జస్టిస్ కరోల్ అన్నారు. రాజ్యాంగం గొప్పతనం పెద్ద పెద్ద కేసుల్లోనే పరీక్షకు గురికాదని, సాధారణ పౌర జీవితంలోని ప్రతి చర్యలోనూ అది ప్రతిబింబించాలని పేర్కొన్నారు.

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'




దేశీయ మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదల, కొరత నేపథ్యంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ ప్రభుత్వం విధానాల వల్ల పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపించింది. 'మోదీ ప్రభుత్వ విధానాల్లోని చేదు, చక్కెరలోని మాధుర్యానికి పాకింది' అని కాంగ్రెస్? జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ఆయన శనివారం చేసిన ఎక్స్‌లో ఒక పోస్టు పలు ప్రశ్నలు సంధించారు. "మోదీ ప్రభుత్వానికి నేను సూటిగా మూడు ప్రశ్నలు అడుగుతున్నా. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు గత 9 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఎందుకు పడిపోయాయి? ఎగుమతులను నిలిపివేసి, 10 లక్షల టన్నుల చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునే స్థాయికి మనం ఎలా చేరుకున్నాం?. ఇక రెండోది, మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందు ప్రజలపై ఇంత భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? ముడోది, దేశంలో చక్కెర కొరత ఉన్నప్పుడు, ప్రభుత్వం విదేశాల నుంచి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, జు20 కోసం ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'?"

**'ధరలు పెరగడానికి ఇథనాల్ కారణం కాదు'**

కాగా, దేశంలో చక్కెర ధరలు పెరగడానికి ఇథనాల్ కారణమని వస్తున్న ఆరోపణలను వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఖండించింది. జులై 20న కిలోకు రూ. 48గా ఉన్న చక్కెర ధరలు ఆగస్టు 20 నాటికి కిలోకు రూ. 55కి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని, ఇథనాల్ మళ్లింపు కాదని స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా 2022-23లో సుమారు 12 శాతం నుంచి 2025-26 నాటికి సుమారు 9 శాతానికి తగ్గిందని తెలిపింది. అదే సమయంలో దేశంలోని మొత్తం ఇథనాల్ ఉత్పత్తిలో దాదాపు ముప్పావు వంతు ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని వివరించింది. ఊహించిన దానికంటే తక్కువ దేశీయ ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, వాతావరణ సంబంధిత కారణాల వల్ల ధరలు పెరిగాయని ప్రభుత్వం పేర్కొంది. అదే సమయంలో దేశీయ వినియోగానికి సరిపడా చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నా, కృత్రిమ కొరత సృష్టిస్తూ మిల్లర్లు, వ్యాపారులు ధరలను అడ్డగోలుగా పెంచారని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిల్వదారులు, బ్లాక్ మార్కెటర్లు, స్పెక్యులేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్కెట్‌లో చక్కెర కొరతను నివారించేందుకు కేంద్రం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. చక్కెర సరఫరా పెంచడం, కృత్రిమ కొరతను నివారించడం, ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా నిల్వలపై ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. నెలకు 10 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ విక్రయించే, వినియోగించే పెద్ద వ్యాపారులు, పరిశ్రమలు తమ వద్ద 15 రోజులకు సరిపడా నిల్వలనే ఉంచుకోవాలని ఆదేశించింది. మిఠాయిలు, ఇతర పదార్థాలు, శీతల పానీయాల తయారీదారులు, ఆహారశుద్ధి యూనిట్లు, అమ్మకం దారులు, ఇతర సంస్థాగత కొనుగోలుదారులపై ఈ ఆంక్షలు విధించింది. నవంబరు 30 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని కేంద్రం తెలిపింది. చక్కెర కొరత రాకుండా ముడి పంచదారను 10 లక్షల టన్నుల మేర అక్టోబరు 31 లోపు దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. గతేడాది ఇదే సమయంలో టన్ను 3 వేల 900 రూపాయులగా ఉన్న పంచదార ధర ఇప్పుడు 5,400 - 5,500 స్థాయికి చేరిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు తీసుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత విదేశాల నుంచి చక్కెర దిగుమతులకు కేంద్రం అవకాశం కల్పించడం గమనార్హం.

# గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం



హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ భవనంలో ప్లంబింగ్ పనులు చేస్తున్న ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికి తీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ బిల్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతులను ఉమేశ్? కారె, మోపత్?గా పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్?కు చెందిన వీరు టైల్స్? పనులు చేస్తూ కొండాపూర్?లో నివాసం ఉంటున్నట్లుగా గుర్తించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు సీఎంసీ, హైడ్రా కమిషనర్లు సృజన, రంగనాథ్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. కూలిపోయిన భవన యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### కొద్ది రోజుల్లో ఈ భవనాలన్నీ కూల్చేస్తాం

ఘటనాస్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 50 గజాల్లో ఏడంతస్తులు కట్టారని, దానిపైన పెంట్?హౌస్? కూడా వేస్తున్నారన్నారు. భవనం కూలి ఇద్దరు చనిపోయారని వివరించారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి భవనాలు చాలా ఉన్నాయన్నారు. ఇక్కడి భవనాల్లో చాలావాటికి సెట్‌బ్యాక్‌లు లేవని రంగనాథ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను కూల్చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడి భవనాలు హాస్టల్స్ కోసం వాడుతున్నారన్నారు. బిల్డర్ సాజిద్ కట్టే భవనాలన్నీ ఇలాగే ఉన్నాయని స్థానికులు చెప్తున్నారన్నారు. కొద్ది రోజుల్లో ఈ భవనాలన్నీ కూల్చేస్తామని తెలిపారు. ఈ భవనాలన్నీ ఖాళీ చేయాలని యజమానులకు సూచిస్తున్నామని చెప్పారు. నాలాను ఆక్రమించి భవనాలను ఇష్టానుసారంగా కట్టారని రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజయ్యనగర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

### అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్? (జూం దీప్థుతీఫ్)

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఎంసీ కమిషనర్ సృజన : భవనం కూలి ఆ శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్?మెంట్?పై పడటంతో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్?మెంట్ గోడలు సైతం ధ్వంసమయ్యాయి. పక్కనే ఉన్న ఓ హాస్టల్? విద్యార్థులు భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. మరోవైపు ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ సృజన పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంకా శిథిలాల కింద ఎవరైనా చిక్కుకొని ఉన్నారేమోనన్న అనుమానంతో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం అధికంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎన్డీఆర్?ఎఫ్, ఫైర్?, పోలీసులు భవన శిథిలాలను తొలగిస్తున్నారు.

ప్రమాద ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి : గచ్చిబౌలిలో భవనం కూలి ఇద్దరు మృతిచెందిన ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యచికిత్స అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### సీజ్ చేశాం, చర్యలు తీసుకొనే లోపే

4 నెలల ముందే భవన యజమానికి నోటీసులిచ్చామని సీఎంసీ కమిషనర్ సృజన వెల్లడించారు. భవనాన్ని సీజ్ కూడా చేశామన్నారు. భవన యజమాని ఈ మధ్యే పనులు మొదలుపెట్టినట్లు గుర్తించామని, చర్యలు తీసుకునే క్రమంలో భవనం కూలిపోయిందని కమిషనర్ సృజన వెల్లడించారు.

"మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పెద్ద శబ్దం వినిపించింది. ఏమైందని భయటకు వచ్చి చూస్తే భవనం కూలినట్లుగా తెలిసింది. బిల్డింగ్?లోని నాలుగో ఫ్లోర్?లో ఉన్న ఓ వ్యక్తిపై భవన శిథిలాలు పడి గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించాం. ఈ ప్రమాదం సాయంత్రం సమయంలో జరిగి ఉంటే పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేది. కూలిన బిల్డింగ్ శ్లాబ్? ప్రమాదకర పరిస్థితిలో వేలాడుతోంది. ఆ శిథిలాలను వేగంగా తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి" – స్థానికుడు

### బిల్డర్ కోసం గాలింపు!

అనుమతి లేకుండా బిల్డింగ్? నిర్మించారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సరైన ప్రమాణాలు లేకుండా తక్కువ వ్యవధిలోనే నిర్మించడం వల్లనే పేకమేడలా కూలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు, ఈ భవనం నిర్మాణం చేస్తున్న బిల్డర్ సాజిద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడని తెలిసింది. పోలీసులు అతడికోసం గాలిస్తున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్‌లో పాత రోజులు

-మొదటిపేజీ తరువాయి

మాకు టికెట్ నిరాకరించడానికి అసలు రేవంత్ రెడ్డి ఎవరు? టికెట్ల కేటాయింపు అధిష్టానం పరిధిలోని అంశం అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను స్వతంత్రంగానైనా పోటీ చేసి గెలిచి తీరుతానని సవాల్ విసిరారు. ఆనాడు రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు కావాలని మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేస్తూ, కొడంగల్‌లో ఓడిపోయిన విషయాన్ని సీఎం మరిచి పోవద్దంటూ అత్యంత ఘాటైన స్వరంతో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ స్థాయికి చేరిందో స్పష్టంచేస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలు ఇదివరకే వేర్వేరు సందర్భాల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కగా, ఇప్పుడు కొండా సురేఖ కుటుంబం నేరుగా సీఎంపైనే విమర్శల బాణాలు విసరడం శాసనసభా పక్షంలో సంచలనంగా మారింది. పార్టీలోని పాత కాంగ్రెస్ నేతలు, బీసీ నాయకులను పక్కనబెట్టి, వలస నేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఈ వరుస తిరుగుబాట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు పీసీసీ క్రమశిక్షణా కమిటీ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిస్సహాయంగా మారిపోయారు. బహిరంగంగా పార్టీ సిద్ధాంతాలను, ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం పార్టీలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని ఎంపీ మల్లు రవి వంటి నేతలు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసమ్మతి నేతలను అదుపు చేయడంలో గాంధీ భవన్ నాయకత్వం పూర్తిగా వెనుకబడి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనాపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నప్పటికీ, సొంత కేబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్రమైన విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ ఘర్షణ వాతావరణం, ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని పార్టీలోని అంతర్గత పోరుకు చెక్ పెట్టకపోతే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మరియు క్రెడిబిలిటీకి పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.

### రేవంత్ ఫెయిలవ్వుతున్నారా

తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పుడు పరిపాలన కంటే పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే పెను సవాలుగా మారుతున్నాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శించిన నాయకత్వం.. సొంత పార్టీలోని సీనియర్లు, వలస నేతల అసంతృప్తిని దారికి తేవడంలో మాత్రం తడబడుతోందనే వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధిష్టానాన్ని నేరుగా టార్గెట్ చేయకుండా, కేవలం సీఎం రేవంత్‌ను మాత్రమే కేంద్రబిందువుగా చేసుకుని నేతలు సాగిస్తున్న స్వరం రోజురోజుకూ శృతిమించుతోంది. ఎన్నికల సమయంలో తన అనుకూల వర్గానికి టికెట్లు ఇప్పించుకుని, వారిని గెలిపించుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచీ రేవంత్‌పై ఉన్నాయి. ఆ సమయంలో అధికారమే లక్ష్యంగా అంతా సర్దుకుపోయినా, ప్రభుత్వం ఏర్పడ్డాక సీనియర్లను విస్మరిస్తున్నారనే భావన పాత కాంగ్రెస్ నేతల్లో అసహనాన్ని పెంచింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడం, నామినేటెడ్ పదవుల జాప్యం, పార్టీలో ప్రాధాన్యం తగ్గడం వంటి అంశాలు అంతర్గత అసంతృప్తిని రాజేస్తున్నాయి. కేబినెట్ పదవి ఆశించి భంగపడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొదటి ఏడాది నుంచే సీఎంను లక్ష్యంగా చేసుకుని గళమెత్తుతున్నారు. సీఎం మార్పు ప్రస్తావన తెస్తూ, ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నామనే సంకేతాలు ఇవ్వడం ప్రభుత్వ స్థిరత్వంపై చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్లు నిధుల కొరత, నిర్లక్ష్యంపై బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. దానం నాగేందర్ లాంటి నేతలు గత పాలనను ప్రస్తావిస్తూ ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేత చిన్నారెడ్డి టికెట్ల కేటాయింపు వ్యవహారాలపై విమర్శలు గుప్పించగా, పార్టీ వీడిన జీవన్ రెడ్డి తరచూ సీఎం శైలిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. విజయశాంతి ప్రభుత్వ విధానాలపై పెదవి విప్పగా, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ఏకంగా పరకాల టికెట్ కేటాయింపు, కుటుంబానికి ఎమ్మెల్సీ నిరాకరణ వంటి అంశాలపై సీఎం కుటుంబ సభ్యులను సైతం టార్గెట్ చేస్తూ స్వతంత్ర పోరుకు సిద్ధమవడం ప్రకంపనలు సృష్టిస్తోంది. అసమ్మతి స్వరాలు పెల్లుబుకుతున్నప్పుడు వాటిని బుజ్జగించడం లేదా సమన్వయ కమిటీల ద్వారా పరిష్కరించడంలో అధిష్టానం, సీఎం స్థాయి సంప్రదింపులు కొరవడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపు ప్రతిపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలను రాజకీయంగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు.. సొంత పార్టీ నేతల అసంతృప్తి వ్యాఖ్యలే ప్రతిపక్షాలకు ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. కేటీఆర్, హరీశ్ రావు వంటి విపక్ష నాయకులు కాంగ్రెస్ అసమ్మతి నేతల వ్యాఖ్యలనే కోట్ చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు. ముఖ్యమంత్రిగా పరిపాలనపై పట్టు సాధిస్తున్నప్పటికీ, సొంత గూటిలోని అసమ్మతిని ఒకే తాటిపైకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్నది స్పష్టమవుతోంది. తక్షణమే సమన్వయ యంత్రాంగాన్ని బలోపేతం చేసి, అంతర్గత కుమ్ములాటలకు తెరదించకపోతే.. ఈ అంతర్గత అసంతృప్తే ప్రభుత్వ ఉనికికి రాజకీయంగా గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉంది.

# రాయదుర్గంలోని భూములు రికార్డు ధర

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. ఓూఔ రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్ధలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు. రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మీ దూరం ఉందని, రెండింటికీ



సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇంకా ఈ విషయంపై ఏమైనా వివాదాలుంటే తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవా లని పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూచించింది. ఇప్పటికే ఈ వేలంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్ఆర్‌టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్ఎండీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిందే. దీంతో ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధరతో టీజీఐఐసీ చేపట్టిన ఆన్‌లైన్ వేలానికి మార్గం సుగమమైంది. అయితే టీజీఐఐసీ ఆన్‌లైన్లో భూమల వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో ఎకరా 264 కోట్లు పలికింది. దాదాపు మూడు నెలల కిందట నిర్వహించిన వేలంలో ఇక్కడి భూమి ఎకరా రూ. 237 కోట్లు పలికిన విషయం తెలిసిందే.

## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

-మొదటిపేజీ తరువాయి

చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు.

### ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లివర్ పూల్ ఆసక్తి

లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

### తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.

### కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది

సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన రేపటితో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు.

అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

## మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

-మొదటిపేజీ తరువాయి

టూ శంషాబాద్ మార్గంలో విమానాశ్రయం సమీపంలో 1.6 కి.మీ భూగర్భ మెట్రో విభాగాన్ని ప్రతిపాదించారు. మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్?లో ఫ్లైఓవర్, రెండో ఎలివేటెడ్ మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయానికి సంబంధించి కార్గో విమానాశ్రయ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి ఆమోదం తెలపాలని మెట్రో అధికారులు పౌర విమానయాన శాఖను కోరారు. బేగంపేట విమానాశ్రయ రన్‌వే చుట్టూ ఉన్న 'ఫన్నెల్ జోన్?'లో ఎత్తుకు సంబంధించిన పరిమితులు ఉన్నాయి. అందువల్ల శామీర్?పేట, మేడ్చల్ మెట్రో కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా ప్రణాళిక చేశారు. ఈ మార్గాలకు అనుమతి కావాలని కోరారు.

### రైల్వే క్రాసింగ్‌లు

మెట్రో మార్గం ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ వద్ద రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే నుంచి ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. అయితే సుచిత్ర ప్రాంతానికి సంబంధించిన అనుమతి ఇంకా పెండింగ్‌లో ఉంది.

### జాతీయ రహదారి మార్గాలు

చీఎ–65 (మదీనాగూడ నుంచి పటాన్‌చెరు వరకు, చింతలకుంట నుంచి హయత్ నగర్ వరకు) చీఎ–44 (ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు, బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు) వెంబడి మెట్రో పిల్లర్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు 'రైట్ ఆఫ్ వే' అనుమతులను మంజూరు చేయాల్సి ఉంది.

కేంద్రం వాటా : రూ.6,666 కోట్లు (17%)

రాష్ట్రం వాటా : రూ.11,933 కోట్లు (31%)

రుణాలు : రూ.19,996 కోట్లు (52%)

**వివిధ కార్పొరేషన్ల పరిధిలో విస్తరణ :** ప్రతిపాదిత రెండో దశ మార్గం జీహెచ్?ఎంసీ పరిధిలో 36.5 కి.మీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ మేర విస్తరించి ఉంది. ఇంకా 'రైట్ ఆఫ్ వే' అనుమతులను వేగవంతం చేయాలని మెట్రో రైలు అధికారులు హెచ్?ఎండీఏ కంటోన్మెంట్ బోర్డును కోరారు.

ప్రతిపాదన వివరాలు : కారిడార్లు: 7 దూరం: 122.9 కి.మీ స్టేషన్లు: 86 ప్రాజెక్ట్ వ్యయం: రూ.38,595 కోట్లు ప్రయాణికులు: 12.42 లక్షలు

## కొండాకు పదవీ గండం...



**వరంగల్ :** కొండా సురేఖ మంత్రి పదవి తొలగింపుపై రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరేకంగా అందరూ ఒక్కటయ్యారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖ కుటుంబ వ్యవహార శైలిపై పార్టీ హైకమాండ్ కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. అయితే కొండా సురేఖ మీద చర్యలు తీసుకుంటే కట్టుబాటు తప్పిన మిగిలిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే బీసీ కార్డుతో కొండా సురేఖ పార్టీని ఇరకాటంలోకి పెట్టే అవకాశముంది. అందుకే కొండా సురేఖ వ్యవహారాన్ని పరిశీలిస్తున్న నాయకత్వం ఏదో ఒక చర్య మాత్రం తీసుకోవాలని చూస్తుంది.. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కొండా సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు ఆ వ్యాఖ్యలు తన కుమార్తె వ్యక్తిగతమని, తనకూ వాటికి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేస్తూ క్రమశిక్షణా సంఘానికి లేఖ రాశారు. మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేదా అనే అంశంపై పార్టీ హైకమాండ్ మరియు సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది. దళిత ఎమ్మెల్యేను అవమానపర్చిన సమయంలోనూ, ఇతర సామాజికవర్గం నేతలను కించపర్చినప్పుడు ఒక్కటవ్వని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ విషయంలో ఒక్కటవ్వడంపై కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది కానీ కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలంటే అందుకు కొంత పార్టీ సాహసం చేయాల్సి ఉంటుంది. మిగిలిన క్రమశిక్షణ తప్పిన రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే అవి తప్పుడు సంకేతాలు వెళతాయి. తెలంగాణలో బలమైన బీసీ సామాజికవర్గంలో వ్యతిరేకత వస్తే అది రాజకీయంగా ఇబ్బందిగా మారుతుంది. అందుకే కొండా సురేఖ పై చర్యలు అంత సులువు కాదు. కాకుంటే ఇకపై ఎలాంటి దూకుడు గా వ్యవహరించకుండా కొంత కళ్లెం వేయవచ్చన్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. కొండా సురేఖకు వ్యతిరేకంగా పదహారు మంది ఎమ్మెల్యేలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొందరు లోపాయికారీగా కొండాసురేఖకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. మరి కొండా వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందన్నది చూడాలి.

# సంపాదకీయం

## బీజేపీ ఉచ్చులోనే కాంగ్రెస్

రాజకీయాలలో అత్యంత ప్రమాదకరమైన విషయం ప్రత్యర్థి చూపించే దారిలో ప్రయాణించడం. శత్రువు విసిరిన వ్యూహంలో చిక్కుకుని, అతను నిర్దేశించిన మైదానంలోనే పోరాడటానికి సిద్ధపడటం ఆత్మహత్యాసదృశం!"కాంగ్రెస్ పార్టీ గత పన్నెండేళ్లుగా ఇదే చేస్తోంది. ఇప్పటికీ తెలుసుకోలేకపోతోంది. రాజకీయం అనేది ఎవరూ ప్రత్యేకంగా నేర్పే విద్య కాదు. మారుతున్న పరిణామాలను గ్రహించి, ప్రత్యర్థి వేసే ఎత్తులకు పైఎత్తులు వేస్తూ సమాజంలోని అన్ని వర్గాలను తమవైపు తిప్పుకోవడమే ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా ప్రాణాధారం. కానీ, దేశాన్ని దశాబ్దాల పాటు ఏలిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి నేడు ఆ ప్రాథమిక రాజకీయం కూడా చేతకావడం లేదనేది బహిరంగ రహస్యంగా మారింది. ఒకవైపు స్పష్టమైన హిందుత్వ పోలరైజేషన్‌తో ముందుకు వెళ్తున్న భారతీయ జనతా పార్టీ , మరోవైపు కాంగ్రెస్‌ను కేవలం ముస్లింల పార్టీ గా చిత్రించే వ్యూహాన్ని అత్యంత ప్రతిభావంతంగా అమలు చేస్తోంది. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ నాయకత్వం ప్రతిసారీ బీజేపీ వేస్తున్న ఆ రాజకీయ ట్రాప్‌లోనే పడిపోతూ తన ఓటు బ్యాంకును, ఉనికిని కోల్పోతోంది.పోటీ ప్రపంచంలో ప్రత్యర్థి వేసే ముల్లును అదే ముల్లుతో తీయాలి తప్ప, ఆ ముల్లుపైనే అడుగులేస్తూ వెళ్లడం వివేకం అనిపించుకోదు. బీజేపీ తనపై వేస్తున్న ముస్లిం లీగ్ తరహా భావజాల ముద్రను సమర్థవంతంగా తిప్పి కొట్టలేకపోతే, రాబోయే రోజుల్లో మిగిలిన కొద్దిపాటి ప్రాతినిధ్యాన్ని కూడా కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం మేధోపరమైన వ్యూహాల పేరుతో సాధారణ ప్రజల ప్రాథమిక ఆకాంక్షలకు, జాతీయ భావనలకు దూరంగా జరిగే కొద్దీ కాంగ్రెస్ తన సాంప్రదాయ ఓటు బ్యాంకును మరింత వేగంగా కోల్పోతూనే ఉంటుంది.ఇటీవలి ఎన్నికల విశ్లేషణల ప్రకారం కాంగ్రెస్ సాధిస్తున్న మెజారిటీ విజయాలు, ఓట్లు ఎక్కువగా వచ్చే ప్రాంతాలు మైనారిటీ జనాభా ఉన్నవే. బీజేపీ చేస్తున్న పోలరైజేషన్ ట్రాప్‌లో కాంగ్రెస్ నేరుగా వెళ్లి చిక్కుకోవడానికి నిదర్శనంగా వందేమాతరం' జాతీయ గేయం చుట్టూ జరుగుతున్న వివాదం నిలిచింది. రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీలు నాటి రోజుల్లో సూచించిన అంశాలను సరికొత్త రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రీ–ఫ్రేమ్ చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలం అయింది. ప్రత్యర్థి విసిరిన భావజాల ఎరలో పడి, తన సార్వజనీన జాతీయ ప్రతిష్ఠను కోల్పోతూ మైనారిటీల తుది శరణాలయంగా మాత్రమే మిగిలిపోయేలా కాంగ్రెస్ స్వయంకృత అపరాధం చేస్తోంది. గతం నుంచి పాఠాలు నేర్చుకోకుండా ఆనాటి పొరపాట్లనే మళ్లీ పునరావృతం చేయడం వల్ల, కాంగ్రెస్ పార్టీ భారతీయ ప్రజాస్వామ్యంలో తన ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిననే హోదాను మరింత వేగంగా కోల్పోతోంది. భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ అమలు చేసిన సామాజిక సమీకరణాల వ్యూహం అపూర్వమైన విజయాన్ని సాధించింది. దేశాన్ని దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ నిర్మించుకున్న సామాజిక పునాదిని ఈ వ్యూహం క్రమంగా, శాశ్వతంగా ధ్వంసం చేసింది. ఒకప్పుడు సమాజంలోని అన్ని వర్గాలను తన గొడుగు కిందకు తెచ్చుకున్న కాంగ్రెస్, నేడు తన సాంప్రదాయ ఓటు బ్యాంకులను ఒకటొకటిగా కోల్పోతూ తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. చారిత్రకంగా కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన ఉన్నత వర్గాలు, పట్టణ మధ్యతరగతి ప్రజలను బీజేపీ అత్యంత చతురతతో తనవైపు తిప్పుకుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సామాజిక వర్గాలతో పాటు వేగంగా ఎదుగుతున్న ఉపాధి ఆధారిత పట్టణ సమాజంలో సుపారిపాలన, ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక జాతీయవాదం అనే నినాదాలతో బీజేపీ గట్టి నమ్మకాన్ని నింపింది. కాంగ్రెస్ ప్రతిపాదించే సెక్యులరిజం కేవలం కొన్ని వర్గాలను సంతృప్తి పరచడానికే పరిమితమైందనే భావనను బలంగా ప్రచారం చేయడంలో అధికార పక్షం విజయం సాధించగా, ఈ నిర్ణయాత్మక ఓటు బ్యాంకు కాంగ్రెస్ చేజారి బీజేపీకి శాశ్వత బలగంగా మారింది.కాంగ్రెస్ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న ఓబీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాలను చేరదీయడం బీజేపీ వేసిన అతిపెద్ద వ్యూహాత్మక ఎత్తుగడ. ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం, కాంగ్రెస్ ఆత్మరక్షణ వైఖరి వల్ల నిర్లక్ష్యానికి గురైన నాన్–యాదవ్ ఓబీసీలు, చిన్న చిన్న వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించారు. సంస్థాగత పదవుల నుంచి చట్టసభల టిక్కెట్ల వరకు ఈ వర్గాలకు తగిన స్థానం ఇవ్వడం ద్వారా, కాంగ్రెస్ కేవలం కొన్ని కుటుంబాలు లేదా నాయకులకే పరిమితమైందనే విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. సాంప్రదాయకంగా కాంగ్రెస్ శాశ్వత ఓటు బ్యాంకుగా పరిగణించే దళిత , గిరిజన వర్గాల్లోనూ బీజేపీ పట్టు సాధిస్తోంది. సాంస్కృతిక జాతీయవాదం, స్థానిక గిరిజన పోరాట యోధులకు గుర్తింపు ఇవ్వడం , పిఎం ఆవాస్, ఉజ్వల వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల నమూనా ద్వారా ఈ వర్గాల జీవన ప్రమాణాల్లో మార్పు తెచ్చింది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలను నిశితంగా విశ్లేషిస్తే ఒక రకమైన మైనారిటీ క్లస్టర్ పార్టీగా పరిమితమవుతోందనే వాదన బలపడుతోంది. కాంగ్రెస్ తరఫున విజయం సాధిస్తున్న పార్లమెంటు, అసెంబ్లీ ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు ముస్లిం లేదా క్రైస్తవ జనాభా గణనీయంగా ఉండే ప్రాంతాల నుంచే వస్తున్నారని స్పష్టమవుతోంది. ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణాదిలోని కొన్ని పాకెట్లలో ముస్లిం సాంద్రత ఎక్కువగా ఉన్న స్థానాల్లోనే కాంగ్రెస్ మెరుగైన ఓటు షేర్‌ను, సీట్లను సాధించగలుగుతోంది. దీనికి భిన్నంగా, మెజారిటీ సామాజిక వర్గాలు , ఇతర వెనుకబడిన తరగతులు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ రోజురోజుకూ తన పట్టును కోల్పోతోంది. అనేక ప్రాంతాల్లో ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోవడం లేదా ప్రాంతీయ పార్టీలు, బిజెపిలతో పోలిస్తే ఉనికికే పరిమితమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇది కేవలం ఎన్నికల ఓటములతో ఆగిపోకుండా, కాంగ్రెస్ అంటే కేవలం మైనారిటీల ప్రయోజనాలనే పరిరక్షించే పార్టీ అనే రాజకీయ నిందకు బలం చేకూరుస్తోంది. బిజెపి తన సార్వత్రిక ప్రచారాల్లో ఈ అంశాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటూ, కాంగ్రెస్‌పై ముస్లింల పార్టీ ముద్ర వేసి మెజారిటీ వర్గాలను తనవైపు సమీకరించుకోవడంలో సఫలమవుతోంది. ఒక వైపు తన సాంప్రదాయక హిందూ ఓటు బ్యాంకును పునర్నిర్మించుకోవడంలో విఫలమవడం, మరోవైపు మైనారిటీ ఏకీకరణపైనే పూర్తి స్థాయిలో ఆధారపడాల్సి రావడం వల్ల పార్టీ జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటోంది.ఒకప్పుడు రాజకీయం అంటే తాము నిర్దేశించిన గీతే అనే ధీమా కాంగ్రెస్‌లో బలంగా ఉండేది. ప్రత్యర్థుల ఉనికి నామమాత్రంగా ఉన్న నాటి వాతావరణంలో వరుస విజయాలు ఆ పార్టీకి నల్లపూసలా మారాయి. కానీ ఆరెస్సెస్ అందించే క్షేత్రస్థాయి శ్రేణుల బలం, బీజేపీ సమకూర్చుకున్న ఆధునిక సాంకేతిక, వ్యూహాత్మక బలగాలు ఏకం కావడంతో భారత రాజకీయ చదరంగం రూపురేఖలే మారిపోయాయి. తమ ఓటు బ్యాంకు ఒక్కొక్కటిగా కరిగిపోతున్నా, మార్పును గుర్తించి సరైన ఆత్మపరిశీలన చేసుకోకుండా కాంగ్రెస్ భావజాలపరంగా వరుస స్వయంకృత అపరాధాలు చేస్తూనే ఉంది. సమాజంలో హిందుత్వ వర్సెస్ సెక్యులరిజం భావజాల చర్చ ముందుకు వచ్చిన ప్రతీసారీ, సాధారణ ప్రజామోదం పొందే రీతిలో సమర్థవంతమైన సమాధానం చెప్పడంలో కాంగ్రెస్ తీవ్రంగా తడబడుతోంది ప్రత్యర్థులు లేని హాయిగా గడిచిన గతం ముగిసిపోయిందనే వాస్తవాన్ని కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికైనా గ్రహించాల్సి ఉంది. కేవలం పాత జ్ఞాపకాలనో, దశాబ్దాల నాటి తీర్మానాలనో పట్టుకుని వేలాడటం వల్ల మారుతున్న నేటి యువ భారత్ ఆకాంక్షలను అందుకోవడం అసాధ్యం. బీజేపీ విసురుతున్న రాజకీయ, భావజాల సవాళ్లను తిప్పికొట్టాలంటే కాంగ్రెస్‌కు డిఫెన్సివ్ వైఖరి కాదు, స్పష్టమైన భావజాల పునర్నిర్మాణం , సమగ్రమైన క్షేత్రస్థాయి ఆత్మపరిశీలన అవసరం. కానీ ఆ దిశగా కాంగ్రెస్ ఇప్పటికీ మేలుకోలేదు.

# కొత్త సీసాలో పక్వతలేని పాకం!

బండి నారాయణస్వామి రాసిన 'దళిత బహుజన వాదానికి కొత్త పిలుపు' అనే వ్యాసం (ఆంధ్రజ్యోతి, 18.07.2026) దళిత బహుజనుల మతపరమైన అస్తిత్వాన్ని, సామాజిక న్యాయాన్ని ఒకేసారి కాపాడగల ప్రత్యామ్నాయంగా 'హిందూ దళిత బహుజనవాదం' అనే భావనను ప్రతిపాదిస్తోంది. అయితే, ఈ వ్యాసంలో అనేక తార్కిక లోపాలు, భావనాత్మక అస్పష్టతలు, చారిత్రక సరళీకరణలు, ఆధార రహిత సాధారణీకరణలు ఉన్నాయి. వ్యాసకర్త ఒకవైపు ఆరెస్సెస్--బీజేపీ భావజాలాన్ని, మరోవైపు నాస్తిక--మార్క్సిస్టు లౌకికవాదాన్ని ఉంచి, ఈ రెండు ధ్రువాల మధ్య హిందూ దళిత బహుజనులు చిక్కుకున్నారని వాదించారు. భారతదేశంలోని సామాజిక--రాజకీయ ఆలోచనా ప్రపంచం కేవలం ఈ రెండు ధ్రువాలకే పరిమితం కాలేదు. అంబేద్కరిజం, జ్యోతిరావు ఫూలే భావజాలం, పెరియార్ ఉద్యమం, బౌద్ధ దళిత ఉద్యమం, గాంధేయ సామాజిక సంస్కరణ, రాజ్యాంగవాదం, వివిధ సోషలిస్టు సంప్రదాయాలు వంటి అనేక ప్రత్యామ్నాయ భావజాలాలు కూడా ఉన్నాయి. అదేవిధంగా, మొత్తం నాస్తికవాదాన్ని ఆయన చిత్రీకరించిన తీరు కూడా ఆధార రహిత సాధారణీకరణ. నాస్తికులు మతాన్ని అధ్యయనం చేయరన్న వాదనను సమర్థించే ఉదాహరణలు సైతం వ్యాసంలో లేవు. మతాన్ని విశ్లేషించిన ప్రముఖ సామాజిక సిద్ధాంతకర్తలూ లేకపోలేదు. ఉదాహరణకు, డి.డి. కోశాంబి, రొమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్ వంటి అనేకమంది మతాన్ని లోతుగా అధ్యయనం చేశారు. మతాన్ని విమర్శించడం, మతాన్ని అధ్యయనం చేయకపోవడం రెండూ వేర్వేరు విషయాలు. అలాగే, 'మతం తెలియనివారికి సంస్కృతి తెలియదు' అనే వాదన సైతం తార్కికంగా నిలబడదు. సంస్కృతి అనేది కేవలం మతం కాదు. భాష, సాహిత్యం, కళలు, సంగీతం, జానపద సంప్రదాయాలు, చరిత్ర, వంటకాలు, కుటుంబ నిర్మాణం, సామాజిక సంబంధాలు, స్థానిక ఆచారాలు, జీవన విధానాలు... ఇవన్నీ కలిపే సంస్కృతి అవుతుంది. మతం సంస్కృతిలో ఒక భాగం; సంస్కృతి మొత్తాన్ని మతంతో సమానంగా చూడలేం. ఈ రెండింటిని ఒకే అర్థంలో చూడటం భావనాత్మక పొరపాటు వ్యాసంలో ఆరెస్సెస్ పట్ల ఆయన తీసుకున్న వైఖరిలోనూ స్పష్టత లేదు. ఒకచోట దళిత బహుజనుల సామాజిక న్యాయాన్ని ఆరెస్సెస్ నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు, వెంటనే అదే సంస్థ దేశభక్తికి పునాదులు వేసిందని ప్రశంసిస్తారు, ఆ తర్వాత మళ్లీ.. అది హిందూ దళిత బహుజనులకు ప్రమాదమని చెబుతారు. ఇంతకూ ఏ అంశాన్ని అంగీకరిస్తున్నారు? ఏ అంశాన్ని తిరస్కరిస్తున్నారు? ఈ రెండింటి మధ్య గీత ఎక్కడ? అట్లాగే



ఆరెస్సెస్ మధ్యయుగాల వారసత్వ వృత్తులను సమర్థిస్తోందన్న ఆరోపణ తీవ్రమైనది. ఈ ఆరోపణకు తగిన కారణాలు చూపకపోవడంతో అది నిర్ధారిత అంశంగా కాక కేవలం అభిప్రాయంగానే మిగిలిపోతుంది. 'హిందూ దళిత బహుజనుడు' అనే భావనను ప్రతిపాదించినప్పుడు కూడా బండి నారాయణస్వామి ఒక ముఖ్యమైన చారిత్రక ప్రశ్నను పక్కనపెట్టారు. హిందుత్వానికి భిన్నంగా హిందూ దళిత బహుజన అస్తిత్వం అవసరమని చెబుతున్నప్పటికీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎందుకు బౌద్ధమతాన్ని స్వీకరించారు? ఎందుకు లక్షలాది మంది దళితులు హిందూమతాన్ని విడిచారు? ఆయన ప్రతిపాదిస్తున్న ఈ కొత్త సిద్ధాంతం, అంబేద్కర్ చేపట్టిన హిందూమత విమర్శతో ఏకీభవిస్తుందా? విభేదిస్తుందా? లేక దాన్ని అధిగమించాలనుకుంటుందా? అనే ఏ ప్రశ్నకూ వ్యాసం సమాధానం ఇవ్వదు. ఇదే తరహా సాధారణీకరణ క్రిస్టియన్ మేధావుల విషయంలోనూ కనిపిస్తుంది. అలాగే, ముస్లింల రాజకీయ--సామాజిక ప్రతిస్పందనను కేవలం మతగ్రంథాలకు మాత్రమే ఆపాదించడం అతి సరళీకరణ "హిందూ మతాన్ని ప్రజాస్వామ్యీకరించాలి" అనే ప్రతిపాదన కూడా ఒక నినాదంగా మాత్రమే మిగిలిపోయింది. కానీ దాన్ని ఎలా సాధించాలి? ఆలయాల నిర్వహణలో మార్పులా? పూజారి వ్యవస్థలో సంస్కరణలా? వర్ణ వ్యవస్థ నిర్మూలనా? ఒకవైపు బ్రాహ్మణాధిపత్యాన్ని నిర్మాణాత్మక సమస్యగా పేర్కొంటూనే, మరోవైపు అదే వర్గం మతపరమైన వారసత్వాన్ని సంరక్షించిన పాత్రను ప్రశంసిస్తున్నప్పుడు ఈ రెండు మూల్యాంకనాలను ఏ ప్రమాణం ఆధారంగా సమన్వయిస్తున్నారో కూడా వివరించాలి. వ్యాసంలో "దేశం ముందు మతం" అనే స్థానం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఇక్కడ కూడా "దేశం" అనే పదాన్ని ఏ అర్థంలో తీసుకున్నారో సరైన నిర్వచనం లేదు. దేశం అంటే రాజ్యమా? జాతియా? నాగరికతా? లేక రాజ్యాంగ ప్రజాస్వామ్యంలోని పౌరసమాజమా? అలాగే "హిందూ దళిత బహుజనవాదం" అనే భావన ఒక మతపరమైన ఉద్యమమా? రాజకీయ సిద్ధాంతమా? సామాజిక ఉద్యమమా? సాంస్కృతిక వేదికా? అంబేద్కరిజానికి విస్తరణా? హిందుత్వానికి ప్రత్యామ్నాయమా? అనే ప్రశ్నలకు వ్యాసం చివరివరకూ స్పష్టమైన సమాధానం ఇవ్వదు. 'హిందూ దళిత బహుజనవాదం' అనే భావనకు స్పష్టమైన నిర్వచనం, తార్కిక సమగ్రత, చారిత్రక ప్రాతిపదిక, ఆచరణాత్మక రూపకల్పన నారాయణస్వామి వ్యాసంలో కనిపించవు. అందువల్ల ఆయన వ్యాసం చర్చకు ఆహ్వానించే ప్రతిపాదనగా నిలిచినా, సిద్ధాంత నిర్మాణంగా మాత్రం నిలబడదు.

# ఆధునిక భారతానికి అతనే సర్కార్ !!

'భారతీయ చరిత్రకారులమైన మేము, ఏ ఇతర అజెండాను అనుసరించకుండా సొంత అజెండా ప్రకారమే రాయాలనుకున్న చరిత్రలనే రాశాము. అయితే ఇది గతించిన విషయం. ఆ మేధా స్వేచ్ఛ ఇప్పుడు లభించడం లేదు. అది వేగంగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది'-- దశాబ్దాల తన మేధా కృషిని సింహావలోకనం చేసుకుంటూ ఆధునిక భారత దేశ చరిత్రకారుడు సుమిత్ సర్కార్ విచారగ్రస్తంగా చేసిన వ్యాఖ్యలవి. ప్రతిభావంతమైన, సూత్రబద్ధమైన భారతీయ మార్క్సిస్ట్ చరిత్రకారులలో అగ్రగణ్యుడిగా సుదీర్ఘమైన, మేధో సంపద్వంతమైన జీవితాన్ని గడిపిన సుమిత్ సర్కార్ ఇతరులు రుద్దిన మూడు చారిత్రక అజెండాలను ఎదుర్కోవలసివచ్చింది. మొదటిది-- గతాన్ని ఆర్థిక నియతి దృక్కోణంలో అధ్యయనం చేసే పిడివాద మార్క్సిజం; రెండోది-- పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజంల అంతస్సంబంధ ధోరణి. మానవ సామాజిక ప్రవర్తన అధ్యయనంలో అత్యంత ప్రభావశీలమైన ఈ మేధో ధోరణి అమెరికాలో స్థిరపడిన లేదా ఆ దేశంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన భారతీయులను మరీ ముఖ్యంగా బెంగాలీ విద్యాధికులను విశేషంగా ఆకర్షించింది. మూడోది-- సంఘ్ పరివార్ మతపరమైన మెజారిటేరియనిజం. పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం ఆలోచనా స్రవంతుల ప్రభావ పరిధిలోనే ఉండిపోయేందుకు సుమిత్ సర్కార్ నిరాకరించారు. ఈ రెండు అత్యాధునిక చింతనాధోరణులను తిరస్కరించడంలో సబాల్టర్న్ స్టడీస్ స్కూల్ లోని తన సహచరుల కంటే చాలా కచ్చితమైన, స్పష్టమైన వైఖరిని ఆయన తీసుకున్నారు. వ్యక్తి జీవితంలోను, సమాజ గమనంలోను ఆర్థిక శక్తులు నిర్వహించే పాత్రకు పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం తక్కువ ప్రాధాన్యమివ్వడాన్ని సుమిత్ సర్కార్ ఆమోదించలేకపోయారు. సంఘ్ పరివార్ హిందుత్వ భావజాలాన్ని ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గతించిన యుగాల చరిత్రపై సంఘ్ తప్పుడు అవగాహనలు, వర్తమానంలో ప్రజాస్వామ్యానికి, బహుళత్వవాదానికి వాటి వల్ల ఎదురవుతున్న విషమ పర్యవసానాల కారణంగానే సంఘ్ పరివార్ ఔదలదాల్చిన మతపరమైన మెజారిటేరియనిజంను సుమిత్ సర్కార్ అమితంగా గర్హించారు. మార్క్సిజంతో సుమిత్ సర్కార్ సంబంధం మరింత సంక్లిష్టమైనది. మార్క్సిస్టు చింతనలోని ఆర్థిక నిర్ణయవాదంతో ఆయన పూర్తిగా ఏకీభవించలేదు. భారతదేశంలో సామాజిక అసమానతలకు కులం, జెండర్ మూల స్తంభాలని, వర్గానికి ఉన్న ప్రాధాన్యమే ఆ రెండిటికీ ఉన్నదని ఆయన గుర్తించారు. సుమిత్ సర్కార్ తన సహచర చరిత్రకారులను దృష్టిలో ఉంచుకుని రాసిన పరిశోధనా పత్రాలలో గానీ, సామాన్య పాఠకులను దృష్టిలో ఉంచుకుని రాసిన వ్యాసాలలో గానీ మార్క్సిస్టు సిద్ధాంత పరిభాష ఉండదు. నాకు తెలిసినంతవరకు ఆయన ఏ కమ్యూనిస్టు పార్టీలోనూ ఎప్పుడూ సభ్యుడిగా లేరు.

సుమిత్ సర్కార్ మొదటి పుస్తకం 'ది స్వదేశీ మూవ్‌మెంట్ ఇన్ బెంగాల్ (1903--1908) 1973లో ప్రచురితమయింది. బెంగాల్ విభజనకు ప్రతిస్పందనగా ప్రజ్వరిల్లిన ఈ స్వదేశీ ఉద్యమం యావద్భారతావనిలో రగిల్చిన అపూర్వ సామాజిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిభావంతంగా వివరించడంతో పాటు ఆ ఉద్యమ వైఫల్యాలను కూడా ఆయన నిశితంగా విశ్లేషించారు. 1997లో ప్రచురితమైన సుమిత్ సర్కార్ మరో పుస్తకం 'రైటింగ్ సోషల్ హిస్టరీ'లో బెంగాలీలకు ఆరాధ్యులు అయిన రామకృష్ణ పరమహంస, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌పై వ్యాసాలతో పాటు రాజకీయ భావజాలాల్లో కులం నిర్వహిస్తున్న పాత్ర, తాను అభిమానించే, లేదంటే ఆమోదించలేని చరిత్ర రచనా సంప్రదాయాలపై నిశిత విమర్శలతో కూడిన వ్యాసాలున్నాయి. ప్రస్తావిత రెండు పుస్తకాలూ మళ్లీ మళ్లీ చదవవలసిన పుస్తకాలే, సందేహం లేదు. అయితే సుమిత్ సర్కార్ రచనలలో అత్యంత ప్రసిద్ధమైనది 'మోడరన్ ఇండియా: 1885--1947.' మన స్వాతంత్ర్యోద్యమంపై సమగ్రమైన, ప్రామాణికమైన రచన అది. వలసపాలన చివరి దశాబ్దాల్లో ఘటనలు, పరిణామాలు, సామూహిక జాతీయవాదం ఆవిర్భావాన్ని సుమిత్ సర్కార్ అనితరసాధ్యంగా వివరించారు. 'మోడరన్ ఇండియా' రాయడంలో తన రెండు ఉద్దేశ్యాలను ఆ పుస్తకం ముందుమాటలో ఆయన ఇలా పేర్కొన్నారు: 'మొదటిది-- రాజకీయ, సామాజిక, ఆర్థిక చరిత్రలోని ప్రత్యేక సమస్యలపై ఇటీవలి కాలంలో వెలువడిన అనేక పరిశోధనా గ్రంథాలను, ఇంకా వెలికితీసిన అపార సమాచారాన్ని ఒక చోట చేర్చడం; రెండవది-- నాయకుల కార్యకలాపాలు, ఆదర్శాలు లేదా వర్గ పోరాట వ్యూహాలకే జాతీయవాద చరిత్ర రచన ఇస్తున్న ప్రాధాన్యానికి ప్రత్యామ్నాయంగా.. కింది స్థాయి నుంచి (అంటే సామాన్య ప్రజల కోణం నుంచి) చరిత్రను రచించే అవకాశాలను పరిశీలించడం'. ఈ రెండు ఉద్దేశ్యాలు సంపూర్ణంగా నెరవేరాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఉపఖండంలోని అన్ని ప్రాంతాలకు ఆయన సమప్రాధాన్యమిచ్చారు. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన పోరాటాలు ఉద్యమాలకే కాకుండా, పరాయి పాలకులపై ఆదివాసీల, రైతుల తిరుగుబాట్లకు కూడా సమంజసమైన ప్రాధాన్యాన్ని సుమిత్ సర్కార్ ఇచ్చారు. హిందూ--ముస్లింల మధ్య విభేదాలు ఊపిరిపోసుకున్న తీరుతెన్నులు, దేశ విభజన విషాద ఘటనలను ఆయన గొప్ప నైపుణ్యంతో, కచ్చితత్వంతో వివరించారు. ఈ విశిష్టతల కారణంగానే, ప్రచురితమైన 43 సంవత్సరాల అనంతరం కూడా సుమిత్ సర్కార్ విరచితమైన 'మోడరన్ ఇండియా' భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై అత్యుత్తమ ఏక సంపుటి పుస్తకంగా వెలుగొందుతోంది. 'మోడరన్ ఇండియా'లో కులంపై సుమిత్ సర్కార్ చూపిన శ్రద్ధ మార్క్సిజంపై ఆయన సంప్రదాయ విరుద్ధ వైఖరులను స్పష్టం చేస్తోంది. అంతకంటే ముఖ్యంగా మహాత్మాగాంధీ చారిత్రక ప్రాధాన్యంపై ఆయన భావాలు, అభిప్రాయాలు వారసత్వంగా సంక్రమించిన మనో వైఖరులను ఆయన ఎంతగా విడనాడారో కూడా స్పష్టం చేస్తాయి. మహాత్మాగాంధీ అహింసాత్మక పోరాటం విప్లవ కార్యాచరణ నుంచి ప్రజలను దూరం చేసే కపట వ్యూహమని మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు రజనీ పామీదత్, మానవేంద్రనాథ్ రాయ్ అభిప్రాయపడ్డారు. అలాగే మత సామరస్యానికి మహాత్ముడు ఇచ్చిన ప్రాధాన్యం వర్గ పోరాటాల నుంచి జన బాహుళ్యాన్ని వేరు చేసే యుక్తి మాత్రమేనని కూడా ఆ ఇరువురు తీవ్రంగా విమర్శించారు. అయితే సుమిత్ సర్కార్ ఆ ఇరువురితో విభేదిస్తూ గాంధీ రాజకీయాలలో చాలా లోతైన నైతిక అంశాలు ఉన్నాయని అర్థం చేసుకున్నారు. గాంధీకి సంబంధించి అహింస, సత్యాగ్రహం అనేవి 'ఒక గాఢమైన అనుభూతితో రూపుదిద్దుకున్న విశిష్ట తాత్వికతలు అని, వాటిలో మౌలికత ఉన్నదని, అది గణనీయమైనదేకాక విస్మరించరానిది'ని ఆయన స్పష్టం చేశారు. గాంధీ గురించిన సత్యాన్ని సర్కార్ సరిగానే గుర్తించారు. 'సత్యాన్వేషణే మానవ జీవిత లక్ష్యం' అని మహాత్ముడు అన్నారు. ఆయన ఇంకా ఇలా స్పష్టంగా చెప్పారు: 'అంతిమ సత్యాన్ని ఎవరూ పూర్తిగా తెలుసుకోలేరు. ఎవరికి వారు తమకు తోచిన పాక్షిక సత్యాన్ని ఇతరులపై హింస ద్వారా రుద్దడం పాపకార్యమే'. 1920ల తుదినాళ్ల పరిణామాలను చర్చిస్తూ గాంధీ గురించిన తన భిన్నాభిప్రాయాన్ని సుమిత్ సర్కార్ వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ మతోన్మాదం పెచ్చరిల్లి, భయంకరమైన హత్యాకాండ చోటుచేసుకున్నప్పుడు హిందువులు– ముస్లింల మధ్య సామరస్యాన్ని నెలకొల్పేందుకు నౌఖాలీలో గాంధీ శాంతియాత్ర నిర్వహించారు. ఆ తరువాత ఢిల్లీ, కలకత్తాలో నిరాహార దీక్షలు చేశారు. ఈ పరిణామాలు 'మహాత్ముని అత్యుత్తమ ఘడియలు' అని సుమిత్ సర్కార్ అభివర్ణించారు. మోడరన్ ఇండియా చివరి అధ్యాయంలో ఆయన ఇలా రాశారు: 'మహాత్మాగాంధీ నిజమైన గొప్పతనం, విశిష్ట గుణాలు ఆయన జీవితం తుదినాళ్లలో స్పష్టంగా కనిపించాయి'. ప్రపంచం ముక్తకంఠంతో ఒప్పుకున్న సత్యమిది. కొత్తగా వెలుగులోకి వచ్చిన ప్రాథమిక చారిత్రక సమాచారం ఆధారంగా, అవసరమైతే తన అభిప్రాయాలను మార్చుకోవడానికి సుమిత్ సర్కార్ వెనుకాడేవారు కాదు. ఆయన గొప్ప వచన రచయిత. పదాలను గొప్ప నైపుణ్యంతో ఉపయోగించేవారు. తన భావాలను సూటిగా, స్పష్టంగా చెప్పేవారు. లయబద్ధమైన వాక్యాలను సృష్టించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ కారణంగానే ఆయన పుస్తకాలు విద్వత్ లోకాన్ని దాటి సామాన్య పాఠకులకు ప్రీతిపాత్రమయ్యాయి. సుమిత్ సర్కార్ స్ఫూర్తిదాయక అధ్యాపకుడు కూడా. ఆయన బోధనా విధానం గాంధేయ పద్ధతిలోను, ప్రజాస్వామ్యయుతంగాను ఉండేదని జర్నలిస్ట్ రావిశ్ కుమార్ ప్రశంసించారు. తన విద్యార్థుల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని సుమిత్ అంగీకరించారు. స్త్రీవాద చరిత్రకారిణి అయిన సుమిత్ సతీమణి తనికా సర్కార్ ప్రభావం కూడా ఆయన రచనలలో స్పష్టంగా కనిపిస్తుంది. తాను అభిమానించే చరిత్రకారుడు ఇ.పి.థాంప్సన్. చరిత్ర రచనలో పథ నిర్దేశం చేసిన థాంప్సన్ పుస్తకాల గురించి, ఇంకా అనేక రాజకీయ, సామాజిక అంశాలపైన ఆయనతో జరిపిన చర్చలు తన మనస్సుపై ప్రగాఢ ముద్ర వేశాయని సుమిత్ తరచూ చెప్పేవారు. సామాజిక, మానవీయ శాస్త్రాలలో మౌలిక పరిశోధనలకు ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని సుప్రసిద్ధం చేసిన ప్రవాస బెంగాలీ మేధావులలో సుమిత్ సర్కార్ ఒకరు. కలకత్తాకే వారు పరిమితమైవుంటే బహుశా భారతీయ ఉన్నత విద్యా జగత్తు కీర్తికాంతులు అంత ఉజ్వలంగా ఉండేవికావేమో?! ఈ సత్యం ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన తమిళ్, మహారాష్ట్రియన్, కన్నడిగ, ఉత్కళ, బిహారీ, పంజాబీ విద్వద్వరేణ్యులకు కూడా పూర్తిగా వర్తిస్తుంది. సుమిత్ సర్కార్ మరణంతో ఢిల్లీ విశ్వవిద్యాలయం చరిత్రలో ఒక ఉజ్వల అధ్యాయం ముగిసింది.

## ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం



**లక్ష్మణ్ చందా, ఆగస్టు 22(మన మీ వార్త న్యూస్)**

మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్మారం గ్రామ ప్రజలకు సర్పంచ్ బుర్కముత్యం, ఉప సర్పంచ్ గజ్జల ఉదయశ్రీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి మేఘనా రెడ్డి ఆధ్వర్యంలో ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగింది. పరిశుభ్రత మన బాధ్యత చెత్తబుట్టల కార్యక్రమం ధర్మారం పరిశుభ్రంగా ఆరోగ్యంగా ఉంచడమే మన ప్రధాన లక్ష్యం ఇళ్లలో చెత్తను రోడ్లపై వేయకుండా తడి మరియు పొడి చెత్తను వేరువేరుగా వేయడం కోసం శనివారం రోజున ప్రతి ఇంటికి చెత్తబుట్టలను పంపిణీ చేయడం జరిగింది. చెత్త బుట్టలను సరిగ్గా ఉపయోగించి, మన ధర్మారం గ్రామాన్ని రోగాలు లేని శుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే ప్రధాన లక్ష్యం ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త నవనీత,వార్డు మెంబర్లు, ఐకెపి సిబ్బంది,ధర్మారం గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## అర్బన్ మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డికి ఘన సన్మానం

**కాప్రా, ఆగస్టు 22:(వార్త ప్రతినిధి)**



అర్బన్ మేడ్చల్ జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గిరివర్ధన్ రెడ్డిని కాప్రా ప్రాంతానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో గిరివర్ధన్ రెడ్డి విజయవంతంగా రాణించాలని, ఆయన నాయకత్వంలో జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు అంబికా, విజయ్, వినోద్, నిశాంత్‌లతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో 22 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభం

**జవహర్ నగర్ ఆగస్టు:( వార్త ప్రతినిధి )**






జవహర్ నగర్ పరిధిలోని గాంధీనగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాలలో తీవ్రంగా ఉన్న డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. రూ,22, లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ మేయర్, భూమి పూజ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సదానందు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని ప్రతి వార్డులోనూ ప్రజ ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను క్రమంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. స్థానికులకు ఎలాంటి మురుగునీటి ఇబ్బందులు కలగకుండా త్వరలోనే నాణ్యతా ప్రమాణాలతో ఈ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్, ముఖ్య నాయకులు భాస్కర్, గజ్వెల్ శంకర్, వెంకటేశ్వర్లు, మాట్లా శ్రీను, రఫిక్, శ్రీమాన్, రమేశచారీ, వీరభాస్కర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ పైనుంచి దూకి రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

**(మన మీ వార్త న్యూస్): ఆగష్టు 22, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**




పోలీసుల కట్టుదిట్టమైన భద్రతలో ఓ నిందితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నగరంలోని నిజామాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది.

**జిల్లా జైలు నుంచి..**

వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు పోలీస్ స్టేషన్ లో లకావత్? రాజు అనే వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా అతడిని ఇటీవల సారంగపూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే శనివారం సాధారణ వైద్యపరీక్షల్లో భాగంగా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి అతడిని తీసుకొచ్చారు. అయితే జైలు పోలీసుల ఎస్కార్ట్ మధ్య ఉన్న లకావత్ రాజు వారిని తప్పించుకుని జీజీహెచ్ మూడో అంతస్తు నుంచి కిందికి దూకాడు. దీంతో అతడి తలకు, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. హఠాత్తుగా జరిగిన ఈ ఘటన నుంచి తేరుకున్న పోలీసులు వెంటనే రాజును జీజీహెచ్‌లోని ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన జీజీహెచ్‌లో కలకలం రేపింది.

# డ్రగ్ అక్రమ రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులు జప్తు: సీపీ

**(మన మీ వార్త న్యూస్), ఆగష్టు 22, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**




నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల అక్రమ తయారీ, రవాణా, సరఫరాపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ఈ మేరకు సీపీ సాయిచైతన్య ఆధ్వర్యంలో బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ఆధ్వర్యంలో డ్రగ్స్ నెట్ వర్క్‌ను పోలీసులు ఇటీవల ఛేదించారు.

**గతేడాది క్రితం అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్ల అరెస్ట్**

బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్ప్రాజోలం తయారీ, సరఫరాకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్లపై ఎన్?డీపీఎస్? చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు 2.5 కిలోల అల్ప్రాజోలం, దాని విలువ సుమారు రూ.25 లక్షలు, స్కోడా కారు, 8 మొబైల్ ఫోన్లు, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

**మహారాష్ట్రలో అక్రమ అల్ప్రాజోలం తయారీ కేంద్రం గుర్తింపు**

కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను పోలీస్ కస్టడీలోకి తీసుకుని విచారించగా అల్ప్రాజోలం తయారీ, సరఫరాకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. సీపీ ఆదేశాల మేరకు బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ఆధ్వర్యంలో సుమారు 15 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందం మహారాష్ట్రకు వెళ్లి వారం రోజుల పాటు విస్తృతంగా దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో మహారాష్ట్రలోని సతారా పారిశ్రామిక ప్రాంతంలో, 'సూర్య ప్రభ ఫార్మా కెమ్' పేరుతో ఎరువుల తయారీ కోసం అనుమతులు పొంది, అక్రమంగా అల్ప్రాజోలం తయారు చేస్తున్న ఫ్యాక్టరీని గుర్తించారు. అక్కడ నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.3 కోట్ల విలువైన సుమారు 30 కిలోల అల్ప్రాజోలం, అక్రమంగా సంపాదించిన రూ.12 లక్షల నగదు, ఒక ఫోర్డ్ కారును స్వాధీనం చేసుకుని, అక్రమంగా నిర్వహిస్తున్న ఫ్యాక్టరీని సీజ్ చేశారు.

**ఆస్తుల జప్తు..**

డ్రగ్స్ అమ్మకాలు, తయారీ ద్వారా కూడబెట్టిన రూ.5.15 కోట్ల ఆస్తులను జప్తు చేసేందుకు పోలీస్?శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో మహారాష్ట్రలోని పూణే, సతారా, అహ్మద్‌నగర్ జిల్లాల్లో సంబంధిత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలను సంప్రదించి నిందితులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన స్థిర, చర ఆస్తుల వివరాలను సేకరించారు. నిందితులు అమర్‌సింగ్, బసవరాజ్, లక్ష్మణ్ గౌడ్, వారి కుటుంబ సభ్యులు అల్ప్రాజోలం అక్రమ విక్రయాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించారు. ప్రభుత్వ విలువల ప్రకారం సుమారు రూ.5.15 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించగా, బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ మరింత ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సీపీ**

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..యువత, విద్యార్థులకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , విద్యాసంస్థల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, అక్రమ నిల్వ, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు.

## ప్రిన్సిపాల్ రూప రెడ్డి కి నివాళులు అర్పిస్తూ యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోరం స్టేట్ ప్రెసిడెట్ విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**ఉప్పల్, ఆగస్టు 22 ( మన మీ వార్త):**







నాగార్జున గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపా రెడ్డి హత్యను ఖండిస్తూ, ఆమెకు నివాళులు అర్పించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఉప్పల్‌లో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరివేద వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 300 మంది ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, విద్యా రంగానికి చెందినవారు ర్యాలీలో పాల్గొన్నారు.
ఉప్పల్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజ్ మీదుగా ఉప్పల్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రూపా రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉపాధ్యాయుల గౌరవం, భద్రత, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ, పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని నిర్వాహకులు కోరారు.
ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు అవసరం ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే మార్గదర్శకులని ఫోరం నాయకులు పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసాన్ని అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో ఉపాధ్యాయులు అనేక రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల ప్రవర్తన, తల్లిదండ్రుల అంచనాలు, విద్యా సంస్థల బాధ్యతలు, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలు వారి వృత్తిపై అదనపు ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులకు గౌరవంతో పాటు రక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

**-----ప్రైవేట్ పాఠశాలలకు పోలీసుల అండ కోరిన యాజమాన్యాలు**

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పనిచేసే యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బందికి రక్షణ కల్పించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఇటువంటి ఘటనలు మరోసారి జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
"ఉపాధ్యాయుడిని గౌరవిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుంది" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని నిర్వాహకులు అన్నారు. ఒక విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయుడి ప్రభావం ఎంతో ఉంటుందని, అలాంటి ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు.

**----'ప్రొటెక్ట్--ఎడ్యుకేట్--ఎంపవర్' నినాదం**

యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతిపాదిస్తున్న 'ప్రొటెక్ట్--ఎడ్యుకేట్--ఎంపవర్' నినాదం ద్వారా ఉపాధ్యాయుల రక్షణ, విద్యా వ్యవస్థ బలోపేతం, విద్యార్థుల సాధికారత అనే మూడు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు నాయకులు తెలిపారు. విద్యా రంగం బలపడాలంటే ముందుగా ఉపాధ్యాయుడు భద్రంగా, గౌరవంగా పనిచేసే వాతావరణం ఏర్పడాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షులు సిరిపురం ఉపేందర్, శ్రీధర్, వడ్డేపల్లి కబీర్ భాష, చందన, వసుంధర, ఉషారాణి, రాష్ట్ర నాయకులు పి.వి. రాం నర్సయ్య, సూరం రామిరెడ్డి, వెంకటేష్, సందీప్, వేములకొండ వెంకన్న గౌడ్, సోమశేఖర్ గౌడ్, రాజు, ఆనంద్ కుమార్, కిరణ్, గోవర్ధన్ రెడ్డి, జోషి, సందీప్ తదితరులతో పాటు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేగళ్ల సతీష్ రెడ్డికి గురు పురస్కార్ అవార్డు






**ఉప్పల్, ఆగస్టు 22 ( మన మీ వార్త):**

అయ్యప్ప స్వామి భక్తులకు, గురుస్వాములకు సేవలందిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న కాప్రాకు చెందిన రేగళ్ల సతీష్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 2026 గురు పురస్కార్ అవార్డు లభించింది. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో మహాసేస్త సేవా సంఘం ఆధ్వర్యంలో, రాజు గురుస్వామి నేతృత్వంలో నిర్వహించిన గురు పురస్కార్ అవార్డు ప్రధానోత్సవంలో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేరళలోని పందలం రాజవంశీకులు రాజా తిరునల్ సురేష్ వర్మ చేతుల మీదుగా రేగళ్ల సతీష్ రెడ్డి గురుస్వామి గురు పురస్కార్ అవార్డును అందుకున్నారు. అయ్యప్ప స్వామి భక్తుల సేవలో, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో, సమాజ సేవలో సేవాభావంతో పనిచేస్తున్న గురుస్వాములను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ అవార్డులను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తి, సేవా కార్యక్రమాల్లో విశేషంగా పనిచేస్తున్న 108 మంది గురుస్వాములను ఈ ఏడాది గురు పురస్కారాలకు ఎంపిక చేసి సత్కరించారు. వివిధ ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి భక్తులకు మార్గదర్శకత్వం అందిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న గురుస్వాముల సేవలను ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు. అవార్డు స్వీకరించిన అనంతరం రేగళ్ల సతీష్ రెడ్డి మాట్లాడుతూ, పందలం రాజవంశీకుల చేతుల మీదుగా గురు పురస్కార్ అవార్డు అందుకోవడం తనకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి సేవలో తాను చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేయడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా భక్తులు, సమాజం కోసం మరింత సేవ చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన అయ్యప్ప స్వామి భక్తులు, గురుస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. అనంతరం అవార్డు గ్రహీత రేగళ్ల సతీష్ రెడ్డి గురుస్వామిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కరుణ్ తేజ్ రెడ్డి, రాకేష్ రెడ్డి, రాజేష్, అభినవ రెడ్డి తదితరులతో పాటు పలువురు అయ్యప్ప స్వామి భక్తులు, గురుస్వాములు పాల్గొన్నారు.

## నవాబుపేట గ్రామానికి వైకుంఠ రథం అందజేత

**శివ్వంపే మీ వార్త ప్రతినిధి ఆగస్టు (22):**

మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి శనివారం ఫ్లెమింగ్ లాబొరేటరీస్ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో గ్రామపంచాయతీకి వైకుంఠ రథాన్ని అందజేసింది. గ్రామ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వైకుంఠ రథాన్ని అందించిన పరిశ్రమ యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఓఓ రామ్ కుమార్, హెడ్ హెచ్ఆర్ మనోహర్, సర్పంచ్ అశోక్ రెడ్డి, హెచ్ఆర్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# పరమేశ్వర్ రెడ్డికి బోనాల ఉత్సవాల ఆహ్వానం

**ఉప్పల్, ఆగస్టు 22 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డిని శనివారం ఉప్పల్‌లోని ఆయన నివాసంలో పలు దేవాలయాల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రావణ మాస బోనాల మహోత్సవాలు, ఫలహార బండి ఊరేగింపులకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేసి, ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. కుషాయిగూడ మార్కెట్, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్, మల్లాపూర్ ప్రాంతాలకు చెందిన దేవాలయాల కమిటీ సభ్యులు ఈ ఆహ్వానం అందజేశారు. అనంతరం మల్లాపూర్, నాచారం ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్ రెడ్డిని కలిసి కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లోని సబేరా కాలనీ వాసులు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన



నిధులు కేటాయించాలని కోరారు. అలాగే ఉప్పల్ శేషసాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులను



త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.
అనంతరం పలువురు తమ కుటుంబ శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను పరమేశ్వర్ రెడ్డికి అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# రెడ్లకో న్యాయం.. బీసీలకో న్యాయమా?
## -- డా. పరికిపండ్ల అశోక్

**మన మీ వార్త ఆగస్టు22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

బీసీ మహిళా మంత్రిపై షోకాజ్ నోటీసు విషయంలో వివిధ బీసీ సంఘాల ఆగ్రహం
ముఖ్యమంత్రిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు విమర్శించినప్పుడు స్పందించలేదని ఆరోపణ
హన్మకొండ, ఆగస్టు 22: దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై వివిధ బీసీ సంఘాల నాయకులు తీవ్రంగా స్పందించారు. బీసీల పట్ల ఒక రకమైన న్యాయం, రెడ్డి సామాజిక వర్గం పట్ల మరో రకమైన న్యాయం జరుగుతోందా? అని బీసీ ఐక్యవేదిక నాయకులు ప్రశ్నించారు. ఈ అంశంపై హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ సామాజికవేత్త, బీసీ ఉద్యమ నాయకుడు డా. పరికిపండ్ల అశోక్ మాట్లాడారు. "రెడ్లకో న్యాయం.. బీసీలకో న్యాయమా?" అంటూ ఆయన ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొంతమంది శాసనసభ్యులు అనేక సందర్భాల్లో ఏకవచనంతో విమర్శించినప్పటికీ, అప్పట్లో ప్రభుత్వం అదే స్థాయిలో స్పందించలేదని ఆయన పేర్కొన్నారు.



అయితే బీసీ మహిళగా, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖ విషయంలో మాత్రం ప్రభుత్వం అతిగా స్పందించి షోకాజ్ నోటీసు జారీ చేయడం పట్ల బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. బీసీ మహిళా మంత్రి విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు సామాజిక న్యాయం సూత్రాలకు అనుగుణంగా ఉందా అని డా. అశోక్ పరికిపండ్ల ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారిని, ప్రజాప్రతినిధులను విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే ఒకే తరహా వ్యాఖ్యలకు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటుందని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం గురించి మాట్లాడే ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల పట్ల ఒకే విధమైన ప్రమాణాలను పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా బీసీలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. "బీసీలు కేవలం ఓటు బ్యాంకు కాదు.. ఈ రాష్ట్ర జనాభాలో మెజారిటీ భాగం. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తాం" అని డా. పరికిపండ్ల అశోక్ స్పష్టం చేశారు. కొండా సురేఖకు జారీ చేసిన షోకాజ్ నోటీసు విషయంలో ప్రభుత్వం తన వైఖరిని పునఃపరిశీలించాలని, అన్ని సామాజిక వర్గాలకు ఒకే న్యాయం వర్తించేలా చర్యలు తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బీసీ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల వివక్షకు తావులేకుండా ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని కోరారు.
ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ, సామాజిక న్యాయం విషయంలో ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో సమానత్వాన్ని చూపించాలని అన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించడంతో పాటు వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో వివిధ కులసంఘాల బీసీ నాయకులు రాంపెల్లి లింగమూర్తి, ఆడెపు సుధాకర్, డాక్టర్ మియాపురం శివుడు, గోవిందుల జనార్దన్, తౌటం శ్రీనివాస్, కొండ బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టి
# రూ.లక్ష కోట్లు నీళ్లల్లో పోశారు.. మంత్రి పొంగులేటి..

**(మన మీ వార్త న్యూస్) : ఆగస్టు 22, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

గత బీఆర్ ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టి రూ.లక్ష కోట్లు నీళ్లల్లో పోశారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి ఆరోపించారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రొసీడింగ్స్ అందజేశారు.

**అర్హులైన ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇల్లు**

పదేళ్ల క్రితం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని.. కానీ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్క పేద కుటుంబానికి లబ్ధి చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. రాష్ట్రంలో నిజామాబాద్? జిల్లా కే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్? కట్టి రూ.కోట్ల నిధులు నీళ్లల్లో పోశారని అన్నారు. కానీ ఏనాడు కూడా పేదవారికి ఇళ్లు కట్టిద్దామని ఆలోచన అప్పటి బీఆర్?ఎస్? ప్రభుత్వానికి లేదన్నారు. పేదలకు మాయమాటలు చెప్పి పదేళ్లు పాలన సాగించిన బీఆర్ఎస్ వారి కార్యకర్తలకే పథకాలు అమలు చేసిందన్నారు. ఏడాదికి రెండు లక్షల చొప్పున పదేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టి ఉంటే నేడు రాష్ట్రంలో ఆడబిడ్డలు బాధపడే పరిస్థితి ఉండేది కాదన్నారు.

**20 రోజుల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి భూమిపూజ**

హైదరాబాద్ తర్వాత పెద్దదైన నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 15 నుంచి 20 రోజుల్లో ఇందిరమ్మ టవర్స్?కు శంకుస్థాపన చేస్తామని పొంగులేటి పేర్కొన్నారు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మిగిలిపోయిన మొండి గోడలతో ఉన్న ఇళ్లను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పూర్తి చేసిందని స్పష్టం చేశారు. 400 ఇందిరమ్మ గృహాలను పారదర్శకంగా అందరి సమక్షంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు అందజేసిన ఘనత కాంగ్రెస్? ప్రబుత్వానిదన్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రభుత్వ కార్యాలయాలకు మార్గదర్శ..**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తహశీల్దార్?, ఆర్డీవో, సబ్? రిజిస్ట్రార్? కార్యాలయాలు పూర్తి శిథిలావస్థకు చేరాయని.. కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని పొంగులేటి అన్నారు. వాటన్నిటికి కొత్త భవనాలు నిర్మించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో 10 కంటే ఎక్కువ స్థలాల్లో కొత్త కార్యాలయాలకు శంకుస్థాపన నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు కేవలం రూ.230కే సిమెంటు బస్తా ఇచ్చే విధంగా సిమెంట్ కంపెనీలను ఒప్పించామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఏమాత్రం తగ్గడం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 70 ఏళ్ల క్రితమే పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి బాటలు వేసిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముందుకు వెళు _న్నామన్నారు.



పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన జిల్లా నిజామాబాద్ అని పేర్కొన్నారు. అలాగే మహిళలను సంతోషంగా చూడాలనే ఉద్దేశంతో ఇప్పటివరకు అనేక సంక్షేమ పథకాలు వారి పేరుతోనే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 ఉచిత కరెంట్?, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ఇలా అనేక పథకాలు అమలు చేస్తూ రానున్న రెండున్నర ఇళ్లలో మరింత ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్?పాల్? సూర్యనారాయణ, భూపతిరెడ్డి, కలెక్టర్? భవేష్? మిశ్రా, ఆయా కార్పొరేషన్ల ఛైర్మన్లు మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, ఉర్దూ అకాడమీ ఛైర్మన్? తాహెర్?, డీసీసీ అధ్యక్షుడు నగేష్? రెడ్డి, డీసీసీ కార్పొరేషన్? అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, వ్యవసాయ కమిషన్? సభ్యుడు గడుగు గంగాధర్?, సీనియర్? నాయకులు కవితారెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం కూలిన ఐదంతస్తుల భవనం



**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం జరిగింది. గచ్చి బౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. భవనం కూలి భారీ శబ్దం రావడంతో భయపడిపోయిన స్థానిక జనాలంతా అక్కడి నుంచి దూరంగా పరుగులు పెట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం జరిగింది. అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనం కూలిపోవడంతో ఓ వ్యక్తి మరణించగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది గాయపడిన వ్యక్తిని హాస్పిటల్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. అంజయ్యనగర్‌లో నాలను అనుకుని అక్రమంగా తక్కువ స్థలంలో ఓ వ్యక్తి ఏడు అంతస్తులతో ఓ భవన నిర్మాణం చేపట్టారు. కేవలం 50 గజాల స్థలంలోనే దాదాపు ఏడు అంతస్థుల నిర్మాణం చేపట్టారు. దీంతో భవన నిర్మాణం పూర్తి కాకుండానే అది కుప్పకూలింది. శనివారం మధ్యాహ్నం సరిగ్గా ఒంటి సమయంలో నిర్మాణంలో ఉన్న ఆ భవనం ఒక్కసారిగా కూలిపోయింది. యజమాని అత్యాశకు పక్కనే ఉన్న నిర్మాణాలు సైతం పాక్షికంగా కూలిపోయాయి. నిర్మాణంలో ఉన్న భవనం కూలి పక్కనే వైట్ ఫీల్డ్ రోడ్డులో ఉన్న మరో అపార్ట్మెంట్ పై పడిపోయింది. దీంతో ఆ భవనం సైతం దెబ్బతిన్నది. భవనం కూలినప్పుడు వచ్చి భారీ శబ్దం విని స్థానికి జనాలు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి కూడా మరణించిచగా.. రమణారెడ్డి అనే వ్యక్తి గాయపడినట్టు సమాచారం. ఇక ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

## నిజామాబాద్?లో ఇందిరమ్మ టవర్స్?..
## మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

**(మన మీ వార్త న్యూస్) : ఆగస్టు 22, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉదయం నిజామాబాద్? నగరంలో పర్యటించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పలు కాలనీల్లో మార్నింగ్ వాక్ చేశారు. ఇప్పటికే పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లును పరిశీలించి, లబ్దిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాల జీవితాల్లో తీసుకొస్తున్న మార్పును ప్రత్యక్షంగా చూడటం ఒక గొప్ప అనుభూతి అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. హైదరాబాద్ తరహాలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల టవర్స్?ను రాష్ట్రంలోని ఇతర పట్టణాలలో కూడ నిర్మించేలా నిజామాబాద్ నుండి శ్రీకారం చుడుతామని మంత్రి ప్రకటించారు. దీని కోసం నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హౌసింగ్ శాఖకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు.

**8 లక్షల ఇళ్లు..**

ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు విడతలు, హైదరాబాద్లో ఇచ్చే మొదటి విడత ఇండ్లతో కలిసి 8 లక్షల ఇండ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. 2 లక్షల ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడా జరిగాయన్నారు. అనంతరం మంత్రి నిజామాబాద్ నగరంలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిర్మించిన డబుల్ ఇళ్లను పరిశీలించారు. ఆ ఇళ్లలో పనులు పూర్తి చేసి, అర్హులైన లబ్దిదారులకు ఎంపిక చేసి మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

## సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అజాంజాహి మిల్లు మాజీ కార్మికుల సమస్య పరిష్కారంపై జిల్లా కలెక్టరేట్‌లో

**మన మీ వార్త ఆగస్టు22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

శనివారం సంబంధిత అధికారులు, పిటిషనర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు.





సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయాలపై తమ అభిప్రాయాలను తెలిపేందుకు కార్మికులు సమయం కోరినట్లు కలెక్టర్ తెలిపారు. వారి అభిప్రాయాల మేరకు మరోసారి సమావేశం నిర్వహించి తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, అజాంజాహి మిల్లు మాజీ కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్?

**(మన మీ వార్త న్యూస్) : ఆగస్టు 22, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**

**- జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం పర్యటించారు. ఈ నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.**

**పీడీఎస్ యూ నాయకులను..**



మంత్రి పర్యటనను విద్యార్థి సంఘాలు అడ్డుకునే అవకాశాలున్నాయని పేర్కొంటూ పోలీసులు పలువురు నాయకులను ముందుస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్?యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్?ను అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్?యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే అషూర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిని పరిష్కరించకుండా విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్? చేశారు.

## ఫిజికల్ లిటరసీపై వీడియో కాన్ఫరెన్స్

**మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**



వరంగల్: గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, యంగ్ ఇండియా స్కిల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ కార్యక్రమంలో భాగంగా ఫిజికల్ లిటరసీ (గ్రాష్ట్రఎంఅఝుశ్రీ రాఠ్‌వతీఘుఝఎ)పై హైదరాబాదు నుండి వైస్ చాన్సలర్ డాక్టర్ కిషోర్ గోపినాథ్ గార్లు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రతి ఒక్కరిలో శారీరక కదలికలు, వ్యాయామం మరియు క్రీడలపై అవగాహన పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసం, సామర్థ్యాన్ని పెంచడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వారు అధికారులు తెలిపారు. అలాగే జీవితకాలం పాటు శారీరక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రజల్లో ప్రేరణ కల్పించడంపై కార్యక్రమంలో చర్చించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి బి. అఖిల్, విద్యా శాఖ అధికారులు, DBCDO, DWO, SETS అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలలపై విద్యార్థులు ర్యాలీ

**ఆగస్టు 22 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి**



మండల కేంద్రమైన వెల్దుర్తి లో శనివారం ప్లాస్టిక్ వస్తువుల నిర్మూలనపై స్థానిక భాష్యం విద్యా మందిర్ విద్యార్థిని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు గ్రామంలోని పుర వీధుల గుండా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరం భాగస్వామ్యం కావాలని ప్లే కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడటం వల్ల జరిగే అనర్థాలపై నినాదాలు రూపంలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్ రెడ్డి ఉపాధ్యాయులు నివారిక లింగం లు పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో శ్రావణ శోభ



శివ్వంపేట మీ వార్త ప్రతినిధి ఆగస్టు (22):

మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ సమీపంలోని చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో వెలసిన సహకార ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. శనివారం ఆలయ చైర్మన్ ఆంజనేయ శర్మ,ప్రధాన పూజారి దేవదత్త శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు,చందన అలంకరణ,ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి దీవెనలతో... ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- అమ్మవారికి కిలో వెండి కిరీటాన్ని బహుకరించిన మేకల అయ్యప్ప

కనుల పండుగగా వేడుకలు... అలరించిన ఆలయ ప్రాంగణం

జవహర్ నగర్ ఆగస్టు 22: (వార్త ప్రతినిధి)



ముత్యాలమ్మ తల్లి దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, తెలంగాణలో సరైన వర్షాలులేక రైతులు కరువును ఎదుర్కొంటున్నారని, వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆకాంక్షించారు. చంద్రపురికాలనీ డివిజన్ శాంతినగర్ లో ముత్యాలమ్మ తల్లి ఆలయంలో నూతనంగా విగ్రహా ప్రతిష్టపాన కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయంగా నిలుస్తాయని. ప్రజలు ధర్మమార్గంలో పయనించాలని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు. పారిశ్రామికవేత్త మేకల అయ్యప్ప అమ్మవారికి కిలో వెండి కిరీటాన్ని అందజేశారని ఆలయ కమిటీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండల్ ముదిరాజ్, సుధాకరాచారి, భార్గవ్రామ్, ప్రసాద్ గౌడ్, సింగన్న బాలాజ్, వెంకటేష్ గౌడ్, జలందర్, నవీన్ గౌడ్, నర్సింహా, అశోక్, నాగభూషణం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు,

## డంపింగ్ యార్డ్ ను తలపిస్తున్న సుక్కమ్మ బస్తి

--- పండుగ వాతావరణం లో విపరీతమైన చెత్త దుర్గంధం వాసనతో భక్తుల తిప్పలు

జవహర్ నగర్ ఆగస్టు 22: (వార్త ప్రతినిధి)



జవహర్ నగర్ మున్సిపాలిటీ ప్రాంతంలో బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న జాతర సమయంలో సుక్కమ్మ కుంట ప్రాంతం అపరిశుభ్రతతో కూడిన డంపింగ్ యార్డ్ ప్రాంతంగా దర్శనమిస్తోంది విపరీతంగా పేరుకుపోయిన ఈ చెత్తను తొలగించాలని మున్సిపాలిటీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చెత్త తొలగింపు విషయంలో నిర్లక్ష్యం వహించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పేరుకుపోయిన ఈ చెత్త నుండి దుర్గంధపు వాసన విరజిమ్మడంతో పాటు ఈగలు దోమలు క్రిమి కీటకాలకు ఆవాసంగా మారి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకొని చెత్తను తొలగించి స్థానికులు అనారోగ్యాల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని లేనియెడల తాగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా బిజెపి మెదక్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి చిన్న గొల్ల మాధవి మల్లేష్




ఆగస్టు 22 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి

బిజెపి పార్టీ మెదక్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన చిన్న గొల్ల మాధవి మల్లేష్ మాట్లాడుతూ బిజెపి పార్టీకి ఎంతో రుణపడి ఉన్నామని అమ్మ గుర్తించి మాకు ఇచ్చిన బాధ్యతను తప్పకుండా చేస్తామని బిజెపి పార్టీ బలోపేతనానికి మెదక్ జిల్లా వ్యాప్తంగా మండల స్థాయి నుంచి ప్రతి గ్రామానికి బిజెపి పార్టీ కార్యకర్తలను తయారు చేస్తామని నాకు ఈ అవకాశం ఇచ్చిన జిల్లా బిజెపి అధ్యక్షులు వాలీదాస్ మల్లేష్ గౌడ్ ఎంపీ రఘునందన్ రావు మరియు ప్రతి బిజెపి కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ భారత్ మాతాకీ జై

# మాదిగ సమాజం ఆర్థిక అసమానతలను అధిగమించాలి

వరంగల్ , ఆగస్టు 22 (మీవార్త ప్రతినిధి ) :

మాదిగ సమాజం ఆర్థిక అసమానతలను అధిగమించాలని మాదిగ సంక్షేమ పరిషత్ జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇంచార్జి వంగూరి ఆనంద్ రావు అన్నారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో లక్ష్మీపురం కమిటీ హాల్ లోమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల మండల సదస్సు నిర్వహించారు.ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వరంగల్ మండల ఇంచార్జీ కన్నెబోయిన ప్రమోద్ మాదిగ అధ్యక్షతన తూర్పు నియోజకవర్గ ఇంచార్జి గంగారపు మల్లన్న మాదిగ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మాదిగ సంక్షేమ పరిషత్ జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇంచార్జి వంగూరి ఆనంద్ రావు మాదిగ, మాదిగ సంక్షేమ పరిషత్ మాజీ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి ప్రణయ్ దీపు మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాజీ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ హాజరై వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగుతున్న ఆత్మగౌరవ ఉద్యమం, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాలను వివరించారు. సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




**మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కమిటీ**

మండల అధ్యక్షులుగా : ఐత చంద్రమౌళి మాదిగ,అధికార ప్రతినిధి: చింత సతీష్ మాదిగ,ప్రధాన కార్యదర్శి: మోలుగురి శ్యామ్ మాదిగ,ప్రధాన కార్యదర్శి-2: ఇసంపెల్లి ప్రశాంత్ మాదిగ,ఉపాధ్యక్షులు: దౌడు నరేష్ మాదిగ,జన్ను కరుణాకర్,మామునూరి అనిల్ మాదిగ,సంక్షేమ పరిషత్ మండల కమిటీ:అధ్యక్షులు: వశపోతుల శ్రీనివాస్ మాదిగ,అధికార ప్రతినిధి: ఇసంపెల్లి బాబురావు మాదిగ,ప్రధాన కార్యదర్శి: ముత్యాల రవి మాదిగ,ఉపాధ్యక్షులు: కవ్వంపల్లి రవి మాదిగ, రాషపెల్లి అశోక్,జన్ను నాని,కార్యదర్శి: బిర్రు కొమురయ్య,సహాయ కార్యదర్శి: పుల్ల అంజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



వరంగల్ మండల నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు ఐత చంద్రమౌళి మాదిగ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని సంఘం బలోపేతానికి, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికై

- 2026 ఆగస్టు 24 నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగాఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల నిరవధిక బందు జయప్రదం చేయండి

- బొమ్మెనసురేష్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి

నిర్మల్ జిల్లా, ఆగస్టు 22(మీ వార్త న్యూస్ )

నిర్మల్ జిల్లా పట్టణం లో సీఐటీయూ బొమ్మేన సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్న ఆర్టీసీ తర్వాత ఆటో రంగమే లక్షలాది మందికి రవాణా సౌకర్యం కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు ఉపాధి కోసం ప్రభుత్వాలపై ఆధారపడకుండా జీవనోపాధి కోసం అప్పులు చేసి ఆటోలు కొనుక్కొని ఈ రోజు ప్రతి మారుమూల గ్రామాల, పట్టణ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తూ లక్షలాది మంది ఆటోల ద్వారా జీవనోపాధి పొందుతూ వాళ్ళ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇలాంటి రోజువారిగా ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు అన్ని కార్మిక సంఘాలతో వివిధ సమస్యలపై సమావేశం కావటం జరిగింది. ఆ సందర్భంగా మ్యానిఫెస్టో కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే గత 10 సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న ఆటో డ్రైవర్ల సమ్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటం జరిగింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12వేల రూపాయలు ఇవ్వటం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఇస్తామని గ్యారంటీ కార్డులు ఇవ్వటం




జరిగింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇస్తున్నది.
గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఆటో మీటర్ చార్జీలు గత ఉమ్మడి ప్రభుత్వం ఉన్నప్పుడు 2013 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెంచటం జరిగింది. ఆ తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో ఆటో డ్రైవర్లు, ఆటో సంఘాలు అనేక పోరాటాలు నిర్వహించినా ఆటో మీటర్ చార్జీలు పెంచటంలో విఫలం కావటం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకిరాగానే ఆటో మీటర్ చార్జీలు పెంచుతామని హామీ ఇవ్వటం జరిగింది. ఇప్పటివరకు పెంచిన దాఖలాలు లేవు. వాస్తవంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినప్పుడల్లా ఆటో మీటర్ చార్జీలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. గత 30 సంవత్సరాల నుండి ఆటో డ్రైవర్లు సంక్షేమ బోర్డు కోసం అనేకమైన పోరాటాలు, ఉద్యమాలు చేయటం జరిగినది. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయటం వలన యాక్సిడెంటల్గా ఆటో డ్రైవర్ చనిపోయినా వారి కుటుంబానికి అనేక రకాలుగా ఉపయోగపడతాయి. ఆటో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే లేదా ఆ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏలాంటి సహాయ సహకారాలు లేవు. ఆటో డ్రైవర్లు కేవలం వారి జీవనభృతి కోసం కాకుండా రాష్ట్ర ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తూ ప్రజలు ఇచ్చిన డబ్బులతోనే జీవనం కొనసాగిస్తున్నారు. ఈ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయటం వలన ఆటో, క్యాబ్, లారీ, డిసిఎం లాంటి మోటార్ కార్మికులకు చాలా ఉపయోగం ఉంటుంది. ఈ సంక్షేమ బోర్డు వలన రాష్ట్ర ప్రభుత్వానికి ఏలాంటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేవు. వాస్తవంగా సంక్షేమ బోర్డుకు ఆటోలు కొన్నా, క్యాబ్లు కొన్నా, లారీలు కొన్నా, డిసిఎంలు కొన్నా అనేకమైన వాహనాలపై కొత్తగా కొనుగోలు చేసే సందర్భంలో 2% సెస్సు కనుక వసూలు చేసినట్లయితే కోట్లాది రూపాయలు ఈ సంక్షేమ బోర్డుకు నిధులు వస్తాయి. అదే విధంగా కార్మికుల నుండి సభ్యత్వ రుసుము వసూలు చేసి నమోదు చేసి లక్షలాది మంది సభ్యులుగా చేర్చుకోవచ్చు. ఈ సంక్షేమ బోర్డు వలన రవాణ రంగంలో ఉన్న కార్మికులందరికి భరోసాగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంక్షేమ బోర్డును త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాము. ఓలా, ఊబర్, రాపిడో యాప్ల ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్లను అవసరమైన మేరకు యాప్ల వారు ఇష్టం వచ్చినట్లు కమీషన్లు దండుకుంటున్నారు. ప్రభుత్వమే ఒక యాప్ను తీసుకురావాలని విజ్ఞప్తి. ఈ కార్యక్రమంలో జనతా గ్యారేజ్ యూనియన్ అధ్యక్షుడు, సయ్యద్ ఇసాక్, కార్యదర్శి సైపుల్ ఖాన్, కోశాధికారి వాజత్, ఉపాధ్యక్షులు యూనివరర్స్, విట్టల్,సాగర్, ముజ్జు, ఇతరులు పాల్గొన్నారు,

# వనమహోత్సవంతో కాలనీల్లో పచ్చదనం పెంపు









- నగర మౌలిక వసతుల అభివృద్ధికి సమగ్ర చర్యలు

మన మీ వార్త ఆగస్టు 22వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నగరంలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ హంటర్ రోడ్‌లోని 49వ డివిజన్ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి +జీవీజ కమిషనర్ శ్రీ టి. వెంకన్నతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గత కొంతకాలంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి డివిజన్‌లో స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. వరంగల్ నగరానికి ఆధునిక అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు అవసరమైన నీటి పైప్‌లైన్లు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్ తదితర మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చేపట్టే శాశ్వత రోడ్ల పనుల విషయంలో సమన్వయంతో వ్యవహరించాలని, ప్రజాధనం వృథా కాకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని సూచించారు. నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.530 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేలా నీటి సరఫరా మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌లోని పాత నీటి నిల్వ వ్యవస్థలను ఆధునీకరించడంతో పాటు అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.
జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం అభినందనీయమన్నారు. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటడం సంతోషకరమన్నారు.
నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నగర అభివృద్ధిలో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీరప్పగడ్డ డివిజన్‌లో దెబ్బతిన్న సీవరేజ్ మ్యాన్‌హోల్స్ పునర్నిర్మించాలి-రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్,ఆగస్టు 22 ( మన మీ వార్త):

సీవరేజ్ మ్యాన్‌హోల్ ఎక్కడ దెబ్బతిన్నా తన దృష్టికి తీసుకురావాలని మాజీ కార్పొరేటర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో సీవరేజ్ మ్యాన్‌హోల్స్ దెబ్బతినడంతో వర్షపు నీరు మ్యాన్‌హోల్స్‌లోకి చేరి సీవరేజ్ ఓవర్‌ఫ్లోకు కారణమవుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ వాటర్ వర్క్స్ జీఎం సంతోష్‌కు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై వాటర్ వర్క్స్ అధికారులు వెంటనే స్పందించి సిబ్బందిని రంగంలోకి దించారు. కళ్యాణపురి, రాఘవేంద్ర నగర్, బ్యాంక్ కాలనీ, ధర్మపురి కాలనీతో పాటు బీరప్పగడ్డలోని పలు ప్రాంతాల్లో తీవ్రంగా దెబ్బతిన్న సీవరేజ్ మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి పునర్నిర్మాణ పనులు చేపట్టారు.



ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎక్కడైనా సీవరేజ్ మ్యాన్‌హోల్ దెబ్బతిన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాటిని పునర్నిర్మించేందుకు సంబంధిత అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ విభాగం అధికారులు, బీఆర్ఎస్



రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఏదుళ్ల కొండల్ రెడ్డి, రామాంజనేయులు, శ్యామ్, కళ్యాణపురి అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్, అసోసియేషన్ సభ్యులు గణేష్, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీరంగూడ ఆలయ అభివృద్ధి పనులపై అధికారుల స్థల పరిశీలన





పటాన్ చేరు ఆగష్టు 22 మీ వార్త ప్రతినిధి :

సంగారెడ్డి జిల్లా బీరంగూడ గుట్టపై ఉన్న శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధి పనులపై దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు శనివారం స్థల పరిశీలన చేపట్టారు. దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ శర్మ, అసిస్టెంట్ ఇంజనీర్ తులసీరామ్, అసిస్టెంట్ స్థపతి వెంకటేశ్వరరావు ఆలయాన్ని సందర్శించారు.ఆలయ కార్యనిర్వహణ అధికారి దేవనాదం, చైర్మన్ సుధాకర్ యాదవ్, పాలకమండలి సభ్యుల సమక్షంలో ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. ముఖ్యంగా శివాలయ విగ్రహం ఏర్పాటు, 16 వసతి గృహాలు, హోమశాల, వేద పాఠశాల, సోలార్ వ్యవస్థ తదితర సౌకర్యాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు.ఆలయ భవిష్యత్ అవసరాలు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు సంబంధించిన తగిన ప్లానింగ్, ఎస్టిమేషన్లు, కొటేషన్లు సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం

- పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

గీసుగొండ మండలం ఉకల్ క్రాస్ లోని ఎస్ఎస్ గార్డెన్ లో గీసుగొండ,సంగెం మండలాలు 15,16,17వ డివిజన్ ల పరిధిలోని పేద కుటుంబాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందించే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హత ఉన్నప్పటికీ అనేక మంది పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.గీసుగొండ మండలానికి 11648, సంగెం మండలానికి



16752,15 డివిజన్ 6202,16వ డివిజన్ కి 2164, 17వ డివిజన్ కి 4339 కి నూతన స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేషన్ కార్డు కేవలం ఒక



గుర్తింపు కార్డు మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు ఇది కీలక ఆధారమని పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని, అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

# హనుమకొండ భూసేకరణ ప్రక్రియను వేగవంతం కావాలి

- సేకరిస్తున్న భూముల్లో పెగ్ మార్కింగ్ చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో గౌరవెల్లి ప్రాజెక్ట్, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేస్, దేవాదుల ప్రాజెక్ట్ భూసేకరణ ప్రక్రియ పురోగతి, అవార్డు చెల్లింపులపై రెవెన్యూ, సాగునీటిపారుదల, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం
గౌరవెల్లి కాలువ ప్రాజెక్ట్ లో భాగంగా భూసేకరణ ప్రక్రియను సంబంధిత శాఖల అధికారులు మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.
శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గౌరవెల్లి ప్రాజెక్ట్, పరకాల నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేస్, దేవాదుల ప్రాజెక్ట్ భూసేకరణ ప్రక్రియ పురోగతి, అవార్డు చెల్లింపులపై రెవెన్యూ, సాగునీటిపారుదల, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గౌరవెల్లి కాలువ కోసం వేలేరు, భీమదేవరపల్లి, ధర్మసాగర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇప్పటి వరకు చేపట్టిన భూసేకరణ, అవార్డు చెల్లింపులు, పెగ్ మార్కింగ్, పరకాల నియోజకవర్గం పరిధిలో గ్రీన్



ఫీల్డ్ నేషనల్ హైవే కోసం చేపట్టిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ .. భూసేకరణలో భాగంగా సేకరించిన భూముల్లో పెగ్ మార్కింగ్ వెంటనే చేయాలన్నారు. భూముల సర్వేలో లైసెన్స్ సర్వేయర్లతో పెగ్ మార్కింగ్ ను త్వరగా పూర్తి చేయాలన్నారు.
భూసేకరణ ప్రక్రియలో సంబంధిత రైతులకు పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.
పెండింగ్ చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూసేకరణ ప్రక్రియను పటిష్టంగా చేపట్టాలన్నారు.
ఆర్వోబీలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.
పోర్టల్ లో నమోదై ఉన్న భూభారతి దరఖాస్తులను



వేగంగా పరిష్కరించాలని అన్నారు.
భూభారతి దరఖాస్తులు పెండింగ్ లో ఉండకుండా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు.
జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని, కొనసాగుతున్న రీసర్వేను సంబంధిత మండలాల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.
ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, టెక్నికల్ మేనేజర్ లింగన్న, జనగామ సర్కిల్ సాగునీటిపారుదల (దేవాదుల) ఎస్ఈ సీతారామ్, గౌరవెల్లి ప్రాజెక్ట్ డీఈఈలు చైతన్య, నంద,భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందించాలి

- జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్



ఆగస్టు 22 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి



సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. శనివారం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన తూప్రాన్ సబ్ డివిజన్ వైద్య అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా గర్భిణీలు దీర్ఘ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందించాల్సిన సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ స్థాయిలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేయాలని సూచించారు.
టిబి రోగులను గుర్తించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. టీబీ వ్యాధి పడిన రోగులకు వ్యాధి నివారణకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డెంగ్యూ ఇతర వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైరల్ బారినపడిన రోగులకు మూడు నాలుగు రోజులు దాటితే మలేరియా డెంగ్యూ పరీక్షలు నిర్వహించి రోగులకు సోకిన వ్యాధులకు అవసరపడే మందులను పంపిణీ చేయాలని సూచించారు సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్వో అనిల్ వైద్యురాలు శిరీష సిబ్బంది పాల్గొన్నారు.

## "నేను ముసలోడినాట.. కట్టే పట్టుకుని నడుస్తానట" --- రేవూరి ప్రకాష్ రెడ్డి

మన మీ వార్త ఆగస్టు22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



తనపై కొందరు చేస్తున్న విమర్శలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తన గురించి తప్పుగా మాట్లాడే వారికి వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండటం, ప్రజా సమస్యలపై స్పందించడమే తనకు తెలుసని స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని మాట్లాడినా సహనం కోల్పోయి మాట్లాడే వ్యక్తిని కాదని పేర్కొన్నారు. "నేను ముసలోడినాట.. కట్టే పట్టుకుని నడుస్తానట.. నా గురించి ఎవరు ఎలా మాట్లాడినా వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నా పని" అని రేవూరి ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం.
ఇటీవల పరకాల రాజకీయాల్లో రేవూరి ప్రకాష్ రెడ్డి పేరు చుట్టూ రాజకీయ చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కిరాణా ఫాస్ట్ ఫుడ్ షాప్ దగ్ధం.

- సుమారు లక్ష రూపాయల వరకు నష్టం





మనోహరాబాద్ ఆగస్టు 22 మన మీ వార్త ప్రతినిధి.

మండలంలోని కాళ్ళకల్ గ్రామానికి చెందిన వర్గంటి నాగేష్ కిరాణా మరియు ఫాస్ట్ ఫుడ్ దుకాణంలో విద్యుత్ షాట్ సర్క్యూట్ తో తెల్లవారు జామున మంటలు రావడంతో స్థానికులు ఫోన్ సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి షాప్ లో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణం యజమాని నాగేష్ తెలిపారు.

## అమెరికాతో రూ.3800 కోట్లకు టిక్‌టాక్ ఒప్పందం..!




ఇంటర్నెట్ డెస్క్: చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసును పరిష్కరించుకునేందుకు ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీకొచ్చింది. ఇందుకుగాను ఆ దేశ న్యాయ విభాగానికి 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,800 కోట్లు) చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మొత్తాన్ని రెండు దఫాలలో చెల్లించనున్నట్లు వెల్లడించింది. దీంతో 2024లో దాఖలైన ఈ వ్యాజ్యం ముగిసింది. టిక్‌టాక్ తమతో రాజీ చేసుకోవడం దేశంలోని పిల్లలు, తల్లిదండ్రులకు ఒక పెద్ద విజయమని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం.. వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా యాప్‌లు గోప్యంగా ఉంచేలా పర్యవేక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు, పిల్లల కోసం ఉద్దేశించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని నిర్దేశించే ఫెడరల్ చట్టాన్ని టిక్‌టాక్, దాని చైనా ఆధారిత మాతృ సంస్థ బైట్‌డాన్స్ ఉల్లంఘించాయని ఆరోపిస్తూ.. 2024లో న్యాయ శాఖ వ్యాజ్యం దాఖలు చేసింది. నాటి నుంచి టిక్‌టాక్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ సంస్థ తన వాటాలను తగ్గించుకుంది. దీంతో కొత్త టిక్‌టాక్ యూఎస్ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడానికి ఒరాకిల్ సిల్వర్ లేక్, ఎమిరేట్స్ పెట్టుబడి సంస్థ ఎంజీఎక్స్ వంటి ప్రధాన పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకుంది. పిల్లల భద్రత, గోప్యతపై సోషల్ మీడియా కంపెనీలు పెద్ద సంఖ్యలో వ్యాజ్యాలను ఎదుర్కొంటున్న తరుణంలో టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీ కుదుర్చుకోవడం గమనార్హం

## జవహర్ నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత:
## - తహసీల్దార్ హెచ్చరిక

జవహర్ నగర్ ఆగస్టు 22: (వార్త ప్రతినిధి)



జవహర్ నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు





ఉక్కుపాదం మోపారు. శనివారం కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు, గిర్దావర్ సత్యనారాయణ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది భారీ బందోబస్తు మధ్య జేసీబీ సాయంతో అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. సంతోష్ నగర్, , చెన్నాపూర్, వికలాంగుల కాలనీ, అలాగే కార్మికనగర్ ప్రాంతాల్లో సర్కారు భూములను ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను అధికారులు పూర్తిగా కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అమాయక పేద ప్రజలకు సర్కారు భూములను అమ్మి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు, కబ్జాదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారిపై త్వరలోనే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల రక్షణే ధ్యేయంగా చర్యలు ముమ్మరం చేశామని, జవహర్ నగర్ పరిధిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖపై
## మండిపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్

మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



కొండా సుష్మిత వ్యాఖ్యలకు కొండా సురేఖ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి. మీపై చర్యలు తీసుకుంటే బీసీ కార్డు వాడాలని చూస్తారు మీరు మారని పార్టీ లేదు.. మీరు ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ వాళ్లనే విమర్శిస్తారు ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్

## టిపిసిసి క్రమశిక్షణా
## కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ

తనను, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని

- అవమానకరంగా వ్యాఖ్యలు చేయిస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కమిటి ఛైర్మన్ మల్లు రవి కి విజ్ఞప్తి చేసిన మంత్రి

మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



టిపిసిసి క్రమశిక్షణా కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ, తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తుండటం పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెనుక ఉండి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్న అసలు వ్యక్తులు ఎవరో నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి గారిని కోరుతూ మంత్రి సురేఖ లేఖ రాశారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై బహిరంగంగా విమర్శలు చేయడం, రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్ చేయడం ద్వారా క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించాలని మంత్రి సురేఖ కోరారు.

“పార్టీ క్రమశిక్షణపై నాకు పూర్తి గౌరవం ఉంది. అదే సమయంలో, ఒక సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన నాపై తీవ్ర మాటలతో సామూహిక దాడులు జరుగుతున్నప్పుడు పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నా రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మీడియా ముందుకు రావడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీలించాలి” అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి వున్న పార్టీ అని, ఆ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ కోరారు.

## ఇంటర్ పూర్తయిన వారికి 25న
## జాబ్ మేళా హెచ్ సీ ఎల్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగాల ఎంపిక

మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు “హెచ్ సీ ఎల్ టెక్నాలజీ” వారు నిర్వహిస్తున్న “టెక్ బీ ప్రోగ్రాం” కోసం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25న 2026 (మంగళవారం) సమయం: ఉదయం 11:30 గంటలకు హన్మకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఐసీఎస్సెస్ కంప్యూటర్ కేంద్రంలో అర్హత పరీక్ష నిర్వహించబడును. ఈ ఎంపికకు గాను 2025-2026 విద్యా సం. లో వీుజ, జనరల్, ఒకేషనల్ ఏ గ్రూపులో ఇంటర్ పూర్తి చేసినా అర్హులే. ఇంటర్ పరీక్షల్లో 75 % మార్కులుంటే చాలు. టెక్-బీ ప్రోగ్రాంలో ఎంపికయిన వారికి “సాఫ్ట్ వేర్” ఉద్యోగం తో పాటు డిగ్రీ కూడా పూర్తి చేసుకోవచ్చు. జీతం సం. నికి 2.2 నుండి 2.5 లక్షలుంటుంది. అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకురావాల్సిన సర్టిఫికేట్లు పదవతరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ ఫోటో, ఆండ్రాయిడ్ మొబైల్. మరిన్ని వివరాలకు జిల్లా ఇంఛార్జ్ నరేష్ (7569177071 / 79818 34205 ) ను సంప్రదించవచ్చు.

# -ఆయుష్ వైద్యులపై కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వివక్ష నశించాలి..

- న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాడుతుంది:
- ఆయుష్ వైద్య విద్యార్థుల డిమాండ్లు న్యాయమైనవి.. తక్షణమే స్టైపెండ్ పెంచాలి.
- కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలారా.. మీ గ్రూపు రాజకీయాలు, కుర్చీలాటలు చాలు!
- రోడ్డున పడ్డ ఆయుష్ వైద్యుల ఉసురు పోసుకోవద్దు...
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.

మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు తమ వ్యక్తిగత ఈగోలు, రాజకీయ గొడవలు, పదవుల పంపకాలపై ఉన్న శ్రద్ధ.. రోడ్డున పడి కొట్లాడుతున్న విద్యార్థులపై చూపకపోవడం సిగ్గుచేటు అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల హౌస్ సర్జన్లు (ఇంటర్న్లు), పీజీ వైద్య విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై తెలంగాణ ఆయుష్ (హోఖూం) జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక ధర్నాకు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా పూర్తి మద్దతు ప్రకటిస్తోందని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తెలిపారు. శనివారం కళాశాల ప్రాంగణంలో 19వ రోజు జరుగుతున్న నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి, విద్యార్థులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. అల్లోపతి (వీదీదూ) వైద్యులతో సమానంగా విధులను నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్య విద్యార్థుల పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపడం దురదృష్టకరమన్నారు. ఒకే రకమైన సేవలు అందిస్తున్నప్పటికీ, అల్లోపతి హౌస్



సర్జన్లకు నెలకు ?29,972 స్టైపెండ్ ఇస్తూ, ఆయుష్ హౌస్ సర్జన్లకు కేవలం ?13,754 మాత్రమే ఇవ్వడం తీవ్రమైన అన్యాయమని ఆయన మండిపడ్డారు.

-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయుష్ విద్యార్థుల స్టైఫండ్‌ను పెంచాలని అసెంబ్లీలో గళమెత్తారని, కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టారని బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ విమర్శించారు.

-ప్రభుత్వం జారీ చేసిన జీవో 77 ప్రకారం ఆయుష్ విద్యార్థులకు నెలకు ?30,000 స్టైపెండ్ ఇవ్వాల్సి ఉన్నా, దానిని అమలు చేయకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనం.

**-పదేళ్లుగా మారని భత్యం...**

2016 లో ఖరారు చేసిన స్టైపెండ్‌ను నేటికీ మార్చకపోవడం దారుణం. పెరిగిన జీవన వ్యయాలకు అనుగుణంగా తక్షణమే స్టైపెండ్‌ను పెంచాలి.

-విద్యార్థులకు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు.

-వైద్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయుష్ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన విమర్శించారు. విద్యార్థుల పొట్టకొట్టే ధోరణిని వీడి, ప్రభుత్వం తక్షణమే





స్పందించి అల్లోపతి వైద్యులతో సమానమైన వేతనాన్ని, జీవో 77 ప్రకారం స్టైపెండ్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయుష్ జేఏసీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని గంట రవికుమార్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, బైరి నాగరాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, బైరి శ్యాంసుందర్, ఎరుకల రఘునారెడ్డి, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మదాసు రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, జిల్లా నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, జన్ను ప్రభాకర్, ఇనుముల అరుణ్ కుమార్, మండల నాయకులు వైట్ల గణేష్, తమ్మిశెట్టి క్రాంతి కుమార్, సుంచు కేశవ్, పోశాల సతీష్, సుర శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు ఆడేపు రవిరామ్, వినయ్, మున్నా మరియు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# ప్రగతి ఫలాలు ప్రతి గడపకు,ఇంటికి అందజేస్తా.. వొడితల ప్రణవ్..





- ఇంటి,ఇంటికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ప్రణవ్.
- గ్రామాలలో సమస్యలు తీరుస్తాం..
- కౌశిక్ రెడ్డి అబద్ధపు ప్రచారాలు మానుకో..సోషల్ మీడియాకు,నిజ జీవితానికి చాలా తేడా ఉంటుంది.
- లస్మక్కపల్లిలో విద్యార్థులతో మధ్యాహ్న భోజన పరిశీలన..
- సీఎం విదేశీ పర్యటనకు వెళ్లకుండా బీజేపీ కుట్ర.

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి ఆగస్టు 22

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న క్రమంలో గ్రామాలలో చాలా వరకు సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం రోజున వీణవంక మండలం బేతిగల్,వల్భాపూర్, నర్సింగాపూర్ ,లస్మక్కపల్లి,వీణ వంక, రామకృష్ణాపూర్, కొండపాక ,హిమ్మత్ నగర్, శ్రీరాములపేట, నర్సింహులపల్లి, చల్లూర్,మామిడాలపల్లి,ఎల్బాక,గంగారం,బొంతుపల్లి,ఘన ముక్క,మల్లన్నపల్లి గ్రామాలలో 19 లక్షల విలువ చేసే 49 చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇంటి,ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు.ఇంటి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆపద,కష్ట సమయంలో మమ్మల్ని ఆదుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతూ తమ సంతోషాన్ని తెలిపారు.అనంతరం దేశాయిపల్లి గ్రామంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు ప్రణవ్,ఆయన మాట్లాడుతూ గడిచిన



రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం,అభివృద్ధి అందజేస్తున్నామని దాంతోపాటు పరిస్థితి బాగోక ఆసుపత్రుల పాలైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆసరగా నిలుస్తున్నామని అన్నారు.లస్మక్కపల్లి గ్రామంలోనీ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

**కౌశిక్ రెడ్డి అబద్ధపు ప్రచారాలు మానుకో...**

డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని,మంత్రులుగా,ఎమ్మెల్సీగా,విప్ గా ఉన్నా కూడా చేయలేని పనిని ఇంచార్జిగా చేసి చూపెట్టామని వాటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించామని అన్నారు..అబద్ధాలు ప్రచారం చేయడంలో కౌశిక్ రెడ్డి ముందుంటాడని,ఇప్పటికే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు కూడా అందజేయడం జరుగుతుందని అన్నారు.పేదల మీద చిత్త శుద్ధి ఉంటే ఎమ్మెల్సీ గా ఉన్న సమయంలో లబ్ధిదారులకు ఇళ్లు ఎందుకు పంచలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



**విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డిని ఆపడం బీజేపీ కుట్ర..**

తెలంగాణలో చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్తే దానికి అనుమతి ఇవ్వకపోవడం రాజకీయ కుట్రగా అభివర్ణించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..ముఖ్యమంత్రి హోదాలో విద్యా శాఖ మంత్రిగా అక్కడ విద్యాసంస్థలు సందర్శించి విద్యార్థులకు ఇప్పుడు అందిస్తున్న విద్యతో పాటు ఇంకా మెరుగైన మౌలిక వసతులు అందించేలా కృషి చేస్తే తెలంగాణ విద్యాసంస్థ దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తుందని భయంతో ఆపేశారని,ఇది బీజేపీ పార్టీకి తగదని హెచ్చరించారు.ఇలాంటి కుట్రలకు భయపడే లేదని విద్యార్థుల భవిష్యత్ కోసం పాటుపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీణవంక మండల అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాణ్యతతో గడువులోగా ఐటీ టవర్ నిర్మాణం పూర్తి చేయాలి

- ఏప్రిల్ 2027 నాటికి పనులు పూర్తి చేయాలి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- పనుల పురోగతిపై ‘గ్రాండ్ చార్ట్’ సిద్ధం చేయాలని ఆదేశం

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు 22 మీ వార్త

వనపర్తి జిల్లాలో నాగవరం వద్ద రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.22 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఐటీ టవర్ భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.శనివారం ఉదయం నాగవరం వద్ద నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు పూర్తయిన అనంతరం భవనం ఏ విధంగా ఉండనుంది, ఎన్ని అంతస్తులు ఉంటాయి, భవనం ఎలివేషన్ ఎలా ఉండనుంది అనే అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవన నమూనా చిత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఏప్రిల్ 2026లో ప్రతాప్ రెడ్డి కొండా ఏజెన్సీతో నిర్మాణ పనులకు ఒప్పందం కుదిరిందని, ఏడాది కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఏప్రిల్ 2027 నాటికి ఐటీ టవర్‌ను పూర్తి చేసి అప్పగించేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఏ దశలో ఎంత పని పూర్తి చేయాలి, ఏ సమయానికి ఏ పనులు పూర్తవ్వాలి అనే వివరాలతో ‘గ్రాండ్ చార్ట్’ రూపొందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చార్ట్ ప్రకారం పనులు నిర్ణీత సమయంలో జరుగుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతరం సమీక్షిస్తామని స్పష్టం చేశారు.నిర్మాణానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ తదితర సామగ్రి







విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అయితే నిర్మాణ సామగ్రి అందుబాటులో లేదనే కారణంతో పనులను నిలిపివేయరాదని, అందుబాటులో ఉన్న వనరులతో పనులను నిరంతరం కొనసాగిస్తూ గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో జోనల్ మేనేజర్ జ్యోతి, డీఈ సుబ్బారావు, తహసీల్దార్ రమేష్ రెడ్డి, కాంట్రాక్టర్ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# ఫార్మా రంగంలో 'జీరో ఫైర్' లక్ష్యం

**- తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీ జీ.వి. నారాయణరావు**

**మీ వార్త / కుత్బుల్లాపూర్ :**

జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు నివారణ మరియు నిరంతర భద్రతా విధానాలను అలవర్చుకోవాలని ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపునిచ్చింది. జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్‌లో శుక్రవారం ఎఫ్ఎస్ఏఐ, కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ సంయుక్తంగా 'ఫెసా 2026' (ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్) సదస్సును నిర్వహించాయి.
ఈ కార్యక్రమానికి తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జీవీ నారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఫార్మా పరిశ్రమల్లో కేవలం 'జీరో క్యాజువాలిటీ' కాకుండా 'జీరో ఫైర్' లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. ముందస్తు పొగ గుర్తింపు పరికరాలు, థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు, క్లీన్ ఏజెంట్ ఫైర్ సప్రెషన్ సిస్టమ్స్ వంటి అధునాతన సాంకేతికతలను పరిశ్రమలు వినియోగించాలి.
ఎలక్ట్రికల్ ప్రమాదాల నివారణ
ఫార్మా రంగంలో జరిగే ప్రమాదాల్లో దాదాపు 50 శాతం ఎలక్ట్రికల్ లోపాల వల్లే జరుగుతున్నాయని, ప్రివెంటివ్ ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ ఎంతో అవసరమని నిపుణులు తెలిపారు.





**పదేళ్లలో 102 భారీ ప్రమాదాలు**

తెలంగాణలోని ఫార్మా యూనిట్లలో గత పదేళ్లలో 102 భారీ అగ్నిప్రమాదాలు జరిగాయని, దీనివల్ల రూ.100 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఎఫ్ఎస్ఏఐ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు మనోజ్ వాహి తెలిపారు.
భద్రత అనేది ప్లాంట్ డిజైన్ దశ నుంచే ప్రారంభమవ్వాలని, ఎప్పటికప్పుడు ప్రాసెస్ సేఫ్టీ ఆడిట్లు, ఎమర్జెన్సీ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు.
ఈ సదస్సులో తెలంగాణ ఫ్యాక్టరీస్ శాఖ డైరెక్టర్ వై. మోహన్ బాబు, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈఓ సర్వేశ్ సింగ్, సీఈపీ అధ్యక్షుడు తపస్ సాహా, ఎఫ్ఎస్ఏఐ కార్యదర్శి హుజేఫా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో మంత్రి జూపల్లి

- మూడు రోజులుగా కొల్లాపూర్ నియోజకవర్గంలో విస్తృత పర్యటన
- అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి
- అధికారుల్లో జవాబుదారీతనం కొరవడితే సహించేది లేదు
- రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యంపై అధికారుల తీరుపై అసహనం

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు 22 మీ వార్త**

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలనే లక్ష్యంతో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. వరుసగా మూడో రోజు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి.. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూనే, మరోవైపు ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**స్టేడియాల నిర్మాణానికి కసరత్తు...**

కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా శనివారం పెంట్లవెల్లిలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొల్లాపూర్ పట్టణంతో పాటు వీపనగండ్ల, పానగల్ మండలం కేతపల్లి గ్రామం, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో స్టేడియాల నిర్మాణానికి కసరత్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని, అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.







**మ్యూటేషన్లకు ఏళ్ల తరబడి తిప్పించుకోవడమేంటి...**

అనంతరం పెంట్లవెల్లి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి చర్చించారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించగా.ఆయన ఓపికగా విని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు.ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మ్యూటేషన్ల కోసం దీర్ఘకాలంగా మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యలపై మంత్రి జూపల్లి తీవ్రంగా స్పందించారు. ఏళ్ల తరబడి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తే సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జవాబుదారీతనంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్ర స్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని మంత్రి తెలిపారు.

**ప్రజల ఆశీర్వాదమే బలం...**

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ...25 ఏళ్లకు పైగా రాజకీయాల్లో ఉన్నానని, ఏ రోజు ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, ఇంచు భూమి కూడా కబ్జా చేయలేదని, ఏ పనికీ ఒక్క పైసా తీసుకోలేదని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తున్నానని, అందుకే ప్రజలు సుదీర్ఘకాలంగా తనను ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత బాధ్యతగా పనిచేస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు కార్యకర్తలు యువ నాయకులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# డ్రగ్ ఫ్రీ జిల్లాగా వనపర్తి అక్రమాలకు అడ్డుకట్ట

- ప్రిస్క్రిప్షన్ లేకుండా ప్రమాదకర మందులు విక్రయిస్తే కఠిన చర్యలు
- 52 మెడికల్ షాపులపై దాడులు...10 షాపుల లైసెన్సులు రద్దు
- జాతీయ రహదారుల ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌పై కొరడా
- సీసీటీవీ నిఘా మరింత బలోపేతం ఎస్పీ డి. సునీతారెడ్డి

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగస్టు 22 మీ వార్త**

వనపర్తి జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ విక్రయాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసి వనపర్తిని డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డితో కలిసి కలెక్టర్ ఎన్‌కార్డ్ కమిటీ, రోడ్డు భద్రత టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో డ్రగ్స్ నియంత్రణ, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, మెడికల్ షాపుల తనిఖీలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై సమీక్షించారు.

**ప్రమాదకర మందుల విక్రయాలపై నిఘా...**


వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఆల్ప్రాజోలం, ట్రామడాల్ వంటి ప్రమాదకర మందులను విక్రయించే మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఇప్పటివరకు జిల్లాలో 52 మెడికల్ షాపులపై దాడులు నిర్వహించగా, 12 షాపుల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించామని, అందులో 10 షాపుల లైసెన్సులు రద్దు చేసినట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు.

**విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి...**

డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూ తదితర విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేయాలని సూచించారు.ప్రతి నెలా కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారులకు కల్లు విక్రయించకుండా ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.





**జాతీయ రహదారులపై ఆక్రమణలు సహించం...**

రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి చలాన్లు, జరిమానాలు విధించాలని, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సూచించారు.కొత్తకోట ప్రాంతంలో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల సంస్థ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీలు, ఇతర ట్రాన్స్‌పోర్టర్లు నిర్దేశిత పార్కింగ్ సదుపాయాలను వినియోగించేలా ఫుడ్ పిరమిడ్ పార్కింగ్ స్థలం వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని, జాతీయ రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**కమాండ్ కంట్రోల్‌తో సీసీటీవీ నిఘా...**

జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి మాట్లాడుతూ...మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా ప్రతిరోజూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేసి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా జిల్లాలో సీసీటీవీ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిఘా పెంచి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఎస్పీ బాలాజీ నాయక్, డీటీఓ సురేష్, ఆర్అండ్‌బీ ఈఈ, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, జాతీయ రహదారుల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు...

## చిరంజీవి జన్మదిన వేడుకల్లో మానవత్వం చాటిన మెగా యువత

**- రోగులకు, గర్భిణులకు పండ్ల పంపిణీ.. పేదలకు అన్నదానం**

**చెన్నూర్ ఆగస్టు 22 ( మన మీ వార్త జిల్లా ప్రతినిధి )**




వృద్ధులకు అన్నదానం చేస్తున్న మెగా అభిమానులు

మెగాస్టార్ పద్మవిభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు చెన్నూర్ పట్టణంలో సేవా కార్యక్రమాలతో ఘనంగా జరిగాయి. శనివారం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ, మెగా యూత్ ఫోర్స్ మంచిర్యాల్ జిల్లా అధ్యక్షుడు సిద్ధూ ఆధ్వర్యంలో, తెలంగాణ మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కసరాజు పిలుపు మేరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పేద ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి తమ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. అభిమానాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, ఆపన్నులకు అండగా నిలుస్తూ చిరంజీవి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడుతూ.. మెగాస్టార్ పద్మవిభూషణ్ చిరంజీవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. చిరంజీవి చూపిన సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి సాయి కుమార్, నవీన్ గంధం, ఆడేటి సాయి కుమార్, నేన్నెలా లక్ష్మణ్, సాయి కార్తీక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి చలో ఎస్పీ కార్యాలయం ముట్టడి

**మీ వార్త ఆగస్టు 22 సూర్యాపేట జిల్లా ప్రతినిధి**



సూర్యాపేట: గిరిజన దంపతుల హత్య ఘటనపై న్యాయం కోసం సోమవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సూర్యాపేట ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు లంబాడి విద్యార్థి సేన జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ వీరన్న నాయక్ తెలిపారు. గిరిజన దంపతులను హత్య చేసిన కానిస్టేబుల్ షరీఫ్‌కు కఠిన శిక్ష విధించాలని, కేసులో ప్రమేయం ఉన్న మిగతా వారిని కూడా వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు భద్రత కల్పించాలని కోరారు. జిల్లా మంత్రి స్వయంగా స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వీరన్న నాయక్ కోరారు. గిరిజనుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, న్యాయం జరిగే వరకు గిరిజన సమాజం తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి టీ జి ఎన్ పి డి సి ఎల్



**లక్ష్మణ్ చందా, ఆగస్టు 22(మీ వార్త న్యూస్)**

మండల కేంద్రంలోని చామన్ పల్లి గ్రామంలో వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీజీనపీడీసీల్ నిర్మల్ జిల్లా డి ఈ వెంకటేశ్వర్లు కోరారు.. చామనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...
ప్రజలు తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్ వైర్లను తాకరాదని సూచించించారు. విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టకూడదని, విద్యుత్ పరికరాల సమీపంలో నిర్మాణ పనులు చేసేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.
ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపోవడం లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా సమీప విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయిట్ల లక్ష్మీ సుదర్శన్, ఉప సర్పంచ్ ఏలేటి గంగారెడ్డి, ఏఈ మహేష్, కొమ్మోజి రమణ, రమేష్, లైన్ మెన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.ం

## కాగ్నా వంతెనపై మళ్లీ రంధ్రం.. నాణ్యతపై అనుమానాలు!

**వికారాబాద్** : తాండూరు పట్టణ సమీపంలోని కాగ్నా నదిపై నిర్మించిన వంతెనపై మరోసారి రంధ్రం ఏర్పడటం కలకలం రేపింది. గతేడాది జూలైలో ఇదే వంతెనపై రంధ్రం ఏర్పడగా.. తాజాగా శుక్రవారం మరోసారి రంధ్రం పడింది. సుమారు ఐదేళ్లుగా ఈ వంతెనపై రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో రెండుసార్లు రంధ్రాలు ఏర్పడటంపై వాహనదారులు, స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది జూలై చివర్లో కాగ్నా వంతెన రహదారిపై రంధ్రం ఏర్పడింది. దీంతో సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు పూర్తయి ఏడాది కూడా గడవకముందే తాజాగా మరోసారి రంధ్రం ఏర్పడటం వంతెన నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తేలా చేసింది. రహదారిపై ఏర్పడిన రంధ్రం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకో కుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. రంధ్రం ఏర్పడిన ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు. వంతెనపై రంధ్రం ఏర్పడిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే సోదరుడు బియ్యని శ్రీనివాస్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారులు, నేషనల్ హైవే కాంట్రాక్టర్లను పిలిపించి పరిస్థితిపై చర్చించారు. వాహనదారులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# తిరుమలయ్య గుట్టలో వికాస తరంగిణి సేవా తరంగం

- శ్రావణ శనివారాల్లో వేలాది భక్తుల దాహం తీర్చుతున్న సేవా బృందం
- ఏటా ఉచిత మంచినీటి సౌకర్యం...భక్తుల నుంచి అభినందనలు
- వికాస తరంగిణి సేవలను కొనియాడిన గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ తదితరులు

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగష్టు 22 మీ వార్త**



వనపర్తి జిల్లా : ఆధ్యాత్మికతకు వేదికగా నిలిచే తిరుమలయ్య గుట్టలో శ్రావణ శనివారాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వికాస



తరంగిణి ప్రత్యేకతను చాటుకుంటోంది. ప్రతి సంవత్సరం భక్తుల కోసం ఉచితంగా మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చడం ద్వారా సేవాభావాన్ని చాటుతోంది.శ్రావణ శనివారం సందర్భంగా తిరుమలయ్య గుట్టకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నీటి అవసరం ఏర్పడే సమయంలో వికాస తరంగిణి సభ్యులు ఉచితంగా మంచినీటిని అందిస్తూ సేవలందించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నీటి సరఫరాను అందుబాటులో ఉంచుతూ సేవా కార్యక్రమాన్ని కొనసాగించారు. సేవే లక్ష్యంగా... ఏటా కార్యక్రమం.భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి శ్రావణ మాసంలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మిక క్షేత్రాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో చిన్న సహకారం కూడా ఎంతో విలువైనదేనని పేర్కొన్నారు.వికాస తరంగిణి సేవలకు ప్రశంసలు.ఈ సేవా కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ సందర్శించారు. భక్తులకు మంచినీటిని ఉచితంగా అందిస్తున్న వికాస తరంగిణి సభ్యుల సేవలను అభినందించారు.ప్రజా సేవలో భాగంగా భక్తుల దాహం తీర్చడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షులు శ్రీనివాసులు, వీరేష్తో పాటు సంస్థ సభ్యులు పాల్గొని భక్తులకు మంచినీటి సేవలను అందించారు.

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్** బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను శనివారం ఎఫ్డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్) కు చోటు కల్పించారు. ఈ పోటీ యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని 2026 సెప్టెంబర్ 15లోపు మెయిల్ కు గానీ, 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది.

ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ. లక్ష. మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేల చొప్పున అందించనున్నారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు

## మొబిలిటీ వ్యాలీని సందర్శించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డా. మెతుకు ఆనంద్

**వికారాబాద్** మొమిన్పేట్ మండలం: ఎన్కతల గ్రామ పరిధిలోని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (౧ఉఎఎఅ) ఆధ్వర్యంలో ప్రతిపాదిత తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ప్రాంతాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మరియు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ సందర్శించారు.సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని స్పీకర్ హామీ ఇచ్చినా అమలు కాలేదని, ఆగిపోయిన మొబిలిటీ వ్యాలీ అభివృద్ధి పనులను వెంటనే వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.డా. మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలో ప్రజల తరపున పోరాటం చేస్తున్నామని, ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఆయన ఆరోపించారు.ఎన్కతల గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కంపెనీ వస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయని భూములు ఇచ్చామని, కానీ రెండేళ్లు గడిచినా అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## జార్జిరెడ్డి పి డి స్ యూ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

**గోదావరిఖని :** జార్జిరెడ్డి పి డి స్ యూ ఆధ్వర్యంలో ఆగస్టు 24, 25 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జార్జిరెడ్డి పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు నరేష్ రత్న పిలుపునిచ్చారు× విద్యార్థులు, యువత సమాజంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగం, విద్యా రంగంలో ప్రైవేటీకరణ, ఫీజుల భారం, సామాజిక అసమానతలు వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవడానికి రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు...విద్యార్థి ఉద్యమాల చరిత్ర, ప్రజా ఉద్యమాల పాత్ర, దేశ రాజకీయ పరిస్థితులు, విద్యార్థుల హక్కులు, సామాజిక బాధ్యత తదితర అంశాలపై లోతైన చర్చలు, అధ్యయన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధ్యయనం, ఐక్యత, పోరాటం అనే స్ఫూర్తితో విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు.

# బాలల సంరక్షణ కోసం కృషి చేయాలి

- జిల్లా ఇన్ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి
- జిల్లాలోని పలు బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**మన మీ వార్త ఆగస్టు 22 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

బాలల రక్షణ, సంరక్షణ కోసం కృషి చేయాలని హనుమకొండ జిల్లా ఇన్ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) ఇన్ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి తనిఖీ చేశారు.

జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులతో కలిసి కరుణాపురం లోని కరుణాలయం బాయ్స్ అండ్ గర్ల్స్, ఫాతిమానగర్ లో డివైన్ మెర్సీ, రెవెన్యూ కాలనీ లోని ఒయాసిస్ ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్, సుబేదారి లోని ప్రభుత్వ బాలికా సదనం, అసుంత ఆశా నిలయం, సర్క్యూట్ గెస్ట్ హౌజ్ రోడ్ స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రం, వడ్డేపల్లి లోని బోగవెల్లి రాజేశ్వర్ రావు మెమోరియల్ ట్రస్ట్ ( ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ) కేంద్రాలను తనిఖీ చేసారు,




ఈ సందర్భంగా ఇన్ఛార్జి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు కనీస ప్రమాణాలు పాటించాలని, ముఖ్యంగా భవనాలకు సంబంధించిన సౌండ్నెస్, ఫిట్నెస్ సర్టిఫికెట్ లను కలిగి ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, శానిటేషన్, వాటర్ ప్యూరిఫికేశన్ సంబంధిత, కిచెన్, స్టోర్ , విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు, ఈ సందర్భంగా తనిఖీ చేసిన కేంద్రాలలో డార్మెటరీ, వాష్ రూమ్స్, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశీలించారు, రికార్డులను, పిల్లలకు అందిస్తున్న ఆరోగ్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



లైసెన్స్ కలిగి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకొనే సంస్థలు తప్పకుండా కనీస ప్రమాణాలు పాటించాలని లేనిచో నిబంధనల మేరకు చర్యలుంటాయని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ఎం.విశ్వజ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి బాలల సంరక్షణ కేంద్రాలను కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేస్తామని, నెలకో సారి, సంబంధిత శాఖ అధికారులు మరియు ఐసీడీఎస్ సిడిపివో సూపర్వైజర్ ఆధ్వర్యంలో వార వారం తనిఖీ చేస్తామని ఇందులో భాగంగా కనీస ప్రమాణాలను పాటించేలా తగు సూచనలు, జాగ్రత్తలు తెలియచేసి తదనుగుణంగా నడుచుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్. అవంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్, ఇన్చార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, జిల్లా తనిఖీ బృందం సభ్యులు ఎర్ర శ్రీకాంత్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ జోష్ ఫిలిం ప్రొడక్ట్స్ అవార్డుతో డాక్టర్ పల్లె కిషోర్ కుమార్‌కు ఘన సన్మానం

**మీ వార్త ఆగస్టు 22 సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పల్లె కిషోర్ కుమార్‌కు జూస్ ఇంటర్నేషనల్ ఫిలిం ప్రొడక్ట్స్ సంస్థ గుర్తింపు లభించింది. ఆయన అందిస్తున్న కళా, సామాజిక సేవలను గుర్తించి జాతీయ స్థాయి ఫిలిం ప్రొడక్ట్స్ అవార్డుతో సత్కరించడంతో పాటు ఫిలిం ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు ఘనంగా సన్మానించారు.

డాక్టర్ పల్లె కిషోర్ కుమార్ పోలీసు శాఖలో తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మరోవైపు కళారంగంలోనూ తనదైన ముద్ర వేసుకుంటున్నారు. తబలా కళాకారుడిగా, గాయకుడిగా సంగీతంపై ఉన్న అభిరుచిని కొనసాగిస్తూ అనేక కార్యక్రమాల్లో పాల్గొంటూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. సంగీత కళలతో పాటు ప్రజాసేవను కూడా తన బాధ్యతగా భావిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సమాజంలో అవసరమైన వారికి తన వంతు సహాయం అందించడం, ప్రజల్లో సామాజిక స్పృహ పెంపొందించే కార్యక్రమాలకు సహకరించడం, కళాకారులను ప్రోత్సహించడం వంటి పలు కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. విధి నిర్వహణతో పాటు కళ, సేవా రంగాల్లోనూ సమయం కేటాయిస్తూ ముందుకు సాగుతున్న ఆయన సేవా దృక్పథం పలువురి ప్రశంసలను అందుకుంది.




డాక్టర్ పల్లె కిషోర్ కుమార్ ప్రతిభను, సేవలను గుర్తించిన జూస్ ఇంటర్నేషనల్ ఫిలిం ప్రొడక్ట్స్ సంస్థ జాతీయ స్థాయి అవార్డుతో సత్కరించడం పట్ల సూర్యాపేట జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బంది, కళాకారులు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు శాఖలో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తూ కళాకారుడిగా, గాయకుడిగా, తబలా కళాకారుడిగా, సేవా కార్యక్రమాల్లో ముందుండే వ్యక్తిగా ఆయన సాధిస్తున్న గుర్తింపు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.


సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి తన ప్రతిభ, పట్టుదలతో వివిధ రంగాల్లో గుర్తింపు పొందుతూ ముందుకు సాగుతున్న డాక్టర్ పల్లె కిషోర్ కుమార్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఒకే వ్యక్తిలో పోలీసు సేవా భావం, కళా ప్రతిభ, ప్రజాసేవా దృక్పథం కలగలిసిన అరుదైన వ్యక్తిత్వంగా ఆయనను కొనియాడారు.

కళాకారుడిగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, ప్రజాసేవలో మరింతగా పాల్గొంటూ భవిష్యత్తులో కూడా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టాలని, మరిన్ని జాతీయ స్థాయి అవార్డులు అందుకోవాలని అభిమానులు, సహచరులు ఆకాంక్షించారు. జాతీయ స్థాయి ఫిలిం ప్రొడక్ట్స్ అవార్డు అందుకోవడం సూర్యాపేట జిల్లాకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# ధాన్యం పక్కదారి రూ.66 కోట్ల విలువైన స్టాక్‌పై కలకలం

- మూడు రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు...4,54,905 సంచుల ధాన్యం కొరత
- రెండు మిల్లుల్లోనే 3,51,183 సంచులు...మరో మిల్లులో 1,03,722 సంచులు
- మూడు మిల్లుల యజమానులపై పోలీసులకు ఫిర్యాదులు
- ప్రభుత్వ ధాన్యం లెక్కల్లో భారీ వ్యత్యాసాలు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ బృందాలు





**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో ఆగష్టు 22 మీ వార్త**



వనపర్తి జిల్లా : ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిందన్న సమాచారంతో వనపర్తి జిల్లాలో పౌరసరఫరాల శాఖ అధికారులు, రాష్ట్రస్థాయి ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ బృందాలు చేపట్టిన తనిఖీల్లో భారీగా ధాన్యం కొరత బయటపడింది. మూడు రైస్ మిల్లుల్లో కలిపి సుమారు 4,54,905 సంచుల ధాన్యం వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నల్గొండ ఆంజనేయులు వెల్లడించారు. అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ధాన్యం విలువ సుమారు రూ.66 కోట్లుగా పేర్కొన్నారు.

**రెండు మిల్లుల్లోనే 3.51 లక్షల సంచుల కొరత...**

కీలకమైన గణపురం మండలం అన్‌పహాడ్ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్ (43093-బాయిల్డ్), శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్ (43113-రా) లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించింది.ఆగస్టు 21వ తేదీ అర్ధరాత్రి వరకు కొనసాగిన తనిఖీల్లో రెండు మిల్లులకు వివిధ రబీ, ఖరీఫ్ సీజన్లలో ప్రభుత్వం కేటాయించిన ధాన్యం నిల్వలు, మిల్లింగ్ లెక్కలు, రికార్డులను అధికారులు పరిశీలించినట్లు తెలిపారు.

అధికారుల ప్రకారం బాయిల్డ్ మిల్లులో సుమారు 1,49,198 సంచులు, రా మిల్లులో సుమారు 2,01,985 సంచుల ధాన్యం వ్యత్యాసం గుర్తించారు. రెండు మిల్లులను కలిపి సుమారు 3,51,183 సంచుల ధాన్యం కొరత ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.బాయిల్డ్ మిల్లుకు సంబంధించిన ధాన్యం విలువ సుమారు రూ.31 కోట్లు, రా మిల్లుకు సంబంధించిన ధాన్యం విలువ సుమారు రూ.21 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

**మిల్లు యజమానిపై కేసు కోసం ఫిర్యాదు...**

ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసం గుర్తించిన నేపథ్యంలో సంబంధిత మిల్లు యజమాని ఎస్.శ్రీదేవిపై కేసు నమోదు చేయాలని గణపురం పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 22న సాయంత్రం ఫిర్యాదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నల్గొండ ఆంజనేయులు తెలిపారు.

**పెద్దగూడెం మిల్లులోనూ భారీ కొరత...**

ఇదిలా ఉండగా వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామ శివారులోని ఎమ్మెస్ భాగ్యలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్‌లోనూ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.హైదరాబాద్ యూనిట్‌కు చెందిన రాష్ట్ర విజిలెన్స్ బృందం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆగస్టు 21వ తేదీ రాత్రి వరకు తనిఖీలు కొనసాగినట్లు అధికారులు తెలిపారు.ఈ మిల్లుకు వివిధ సీజన్లలో ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి సంబంధించిన రికార్డులు, స్టాక్ వివరాలు, మిల్లింగ్ లెక్కలను అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో సుమారు 1,03,722 సంచుల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ.14 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

**భాగ్యలక్ష్మిపై కేసుకు పోలీసులకు ఫిర్యాదు...**

ధాన్యం నిల్వల్లో తేడాలు గుర్తించిన నేపథ్యంలో మిల్లు యజమాని శ్రీమతి భాగ్యలక్ష్మిపై కేసు నమోదు చేయాలని వనపర్తి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నల్గొండ ఆంజనేయులు తెలిపారు.

**లెక్కలు..నిల్వలు.. ఎక్కడ తేడా...?**

ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన ధాన్యం, మిల్లుల్లో ఉన్న వాస్తవ నిల్వలు, మిల్లింగ్ అనంతరం తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా లెక్కలు పరిశీలించినట్లు తెలుస్తోంది. రికార్డుల్లో నమోదైన నిల్వలకు, క్షేత్రస్థాయిలో ఉన్న నిల్వలకు మధ్య భారీ వ్యత్యాసాలు గుర్తించడంతో ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ ధాన్యం నిల్వల నిర్వహణలో ఇంత భారీగా వ్యత్యాసాలు ఎలా వచ్చాయి? కేటాయించిన ధాన్యం ఎక్కడికి వెళ్లింది? మిల్లింగ్ ప్రక్రియలో ఏమైనా అక్రమాలు జరిగాయా? రికార్డులు, వాస్తవ నిల్వల మధ్య తేడాకు కారణాలేమిటి? అనే అంశాలపై తదుపరి దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది.అధికారుల తనిఖీల్లో గుర్తించిన కొరత, ధాన్యం విలువ, పక్కదారి ఆరోపణలు దర్యాప్తు అనంతరం తుది నిర్ధారణకు లోబడి ఉంటాయి.

**జిల్లాలో మరిన్ని తనిఖీలకు రంగం సిద్ధమా...?**

ప్రభుత్వ ధాన్యం కేటాయింపులు, మిల్లుల స్టాక్ నిర్వహణపై అధికారులు మరింత లోతుగా పరిశీలిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ముఖ్యంగా సీజన్‌వారీగా కేటాయించిన ధాన్యం, మిల్లుకు చేరిన పరిమాణం, మిల్లింగ్ చేసిన మొత్తం, తిరిగి ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం, ప్రస్తుతం మిల్లులో ఉన్న నిల్వలను సరిపోల్చితే అసలు వ్యత్యాసానికి కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది...

# మెగాస్టార్ బర్త్ డే.. ఐకాన్ స్టార్ స్పెషల్ విషెస్



మెగాస్టార్ చిరంజీవికి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ విషెస్ తెలిపారు. చిరు పుట్టినరోజు సందర్భంగా బన్నీ ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. మన ఏకైక మెగాస్టార్ చిరుకు జన్మదిన శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేశారు. ఆయనకు మనకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారని.. మనలో ప్రతి ఒక్కరినీ ఆయన స్ఫూర్తితో ముందుకు నడిపించారని కొనియాడారు. అంతేకాకుండా చిరు ఫోటోను కూడా చేశారు. ఈ సందర్భంగా బన్నీ KKAVCF అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చారు. దీని అర్థం ఏంటంటే.. తెలుగులో కట్టె కాలే అంత వరకు చిరంజీవి ఫ్యానే అంటూ మరోసారి తన అభిమానం చాటుకున్నారు. ఇది చూసిన బన్నీ అభిమానులు సైతం మెగాస్టార్‌కు విషెస్ చెబుతున్నారు. కాగా.. చిరు బర్త్ డే సందర్భంగా బాబీతో చేస్తోన్న మూవీకి సంబంధించి బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న చిత్రానికి కాకా అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ కోసం అదిరిపోయే గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్‌తో మెగాస్టార్ అభిమానులు పండుగు చేసుకుంటున్నారు.

## 'డీసీ' సినిమా కోసం లోకేష్ కనగరాజ్ కష్టాలు.. గాయం అయినా తగ్గేదేలే!

దర్శకుడిగా కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, వరుస సంచలన విజయాలతో దూసుకుపోతున్న లోకేష్ కనగరాజ్ కేవలం మేకింగ్‌లోనే కాకుండా నటనలోనూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. ముఖ్యంగా ఆయన 'ఐజ' చిత్రంలో ఒక విలక్షణమైన మరియు పవర్‌ఫుల్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఎంతగానో అలరించడమే కాకుండా ఘన విజయాన్ని అందుకున్నారు. అయితే తెరపై కనిపించిన ఆ కొన్ని నిమిషాల అద్భుతమైన నటన వెనుక ఆయన పడిన కష్టం, ఎదుర్కొన్న సవాళ్లకు సంబంధించిన విషయాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సినిమాలోని పాత్ర డిమాండ్ మేరకు లోకేష్ కనగరాజ్ తన శరీరాన్ని పూర్తిగా మార్చుకోవాల్సి వచ్చింది. దీనికోసం ఆయన కఠినమైన డైట్ పాటిస్తూ, ముఖ్యంగా లోయర్ బాడీ వర్కవుట్స్ చేస్తూ శారీరకంగా విపరీతంగా శ్రమించారు. ఇందుకు సంబంధించిన ఒక మేకింగ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఆయన పడిన కష్టాన్ని చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో ఒక యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నప్పుడు ఊహించని ప్రమాదం జరిగింది. తీవ్రమైన స్టంట్స్ చేసే క్రమంలో ఆయనకు 'షోల్డర్ డిస్లోకేషన్' అయ్యింది. ఈ తీవ్రమైన గాయం వల్ల ఆయన చాలా నొప్పితో ఇబ్బంది పడ్డారు. సాధారణంగా అయితే ఎవరైనా షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చి విశ్రాంతి తీసుకునేవారు, కానీ లోకేష్ కనగరాజ్ మాత్రం సినిమా పట్ల, తన పాత్ర పట్ల ఉన్న అంకితభావంతో నొప్పిని సైతం లెక్కచేయకుండా షూటింగ్‌ను పూర్తి చేశారు. దర్శకుడిగా బిజీగా ఉంటూనే, మరోవైపు నటుడిగా ఇంతటి శారీరక శ్రమకోర్చి, గాయాలపాలైనా వెనకడుగు వేయకుండా ఆయన చూపించిన డెడికేషన్ చూసి సినీ ప్రముఖులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక నటుడిగా సక్సెస్ కావడానికి ఆయన ఎంత కష్టపడ్డారో ఈ ఘటనే నిదర్శనమని అభిమానులు కొనియాడుతున్నారు.




# అల్లు అర్జున్ 'రాకా'లో ఊహించని ప్రపంచం.. సెట్స్‌కు వెళ్లి షాకైన మంచు లక్ష్మీ!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అట్లీ తన గత చిత్రాలకు భిన్నంగా ఈసారి సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌ను ఎంచుకోవడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటికే అల్లు అర్జున్ లుక్, అట్లీ మేకింగ్ స్టైల్ గురించి రకరకాల వార్తలు వైరల్ అవుతుండగా.. తాజాగా నటి మంచు లక్ష్మీ చేసిన కామెంట్స్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. ఇటీవల మంచు లక్ష్మీ 'రాకా' షూటింగ్ జరుగుతున్న సెట్స్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. అక్కడ జరుగుతున్న చిత్రీకరణను చూసి తాను ఆశ్చర్యపోయానని ఆమె చెప్పుకొచ్చారు. ముఖ్యంగా సినిమా కోసం సృష్టించిన ప్రపంచం, భారీ సెట్స్, విజువల్ ఎలిమెంట్స్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తాను చూడని ఒక కొత్త ప్రపంచాన్ని అక్కడ చూశానని మంచు లక్ష్మీ పేర్కొన్నారు. సినిమాలో భాగంగా కనిపించే కొన్ని జీవులు, ప్రాణుల డిజైన్లు కూడా తనను ఆశ్చర్యానికి గురిచేశాయని ఆమె వెల్లడించారు. దీంతో 'రాకా' సాధారణ యాక్షన్ సినిమా కాదనే విషయం మరింత స్పష్టమవుతోందనే చర్చ మొదలైంది. 'రాకా'ను సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంచు లక్ష్మీ చేసిన వ్యాఖ్యలు సినిమాలోని ప్రపంచం ఎలా ఉండబోతుందనే ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. కొత్త తరహా విజువల్స్, భారీ యాక్షన్ సీక్వెన్సులు, ఊహకు అందని క్రియేచర్స్‌తో దర్శకుడు అట్లీ ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో ప్రేక్షకులను ఆకట్టుకున్న అట్లీ.. ఈసారి సైన్స్ ఫిక్షన్ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. కథతో పాటు విజువల్ ఎక్స్‌పీరియన్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు చూడని విధంగా చూపించేందుకు అట్లీ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. బన్నీ విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నాడనే వార్తలు ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచాయి. యాక్షన్, ఎమోషన్, సైన్స్ ఫిక్షన్ అంశాలను కలిపి ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో 'పుష్ప' సినిమాతో సొంతం చేసుకున్న క్రేజ్‌కు తగ్గట్టుగానే ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్కేల్‌లో రూపొందించేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్, అట్లీ కలిసి ఎలాంటి విజువల్ వండర్‌ను సృష్టించబోతున్నారో తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం మాత్రం మంచు లక్ష్మీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ 'రాకా'పై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి.

# మెగా ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. విశ్వంభర అప్‌డేట్ ఇదే



చిరంజీవి హీరోగా వస్తోన్న సోషియో ఫ్యాంటసీ యాక్షన్ మూవీ 'విశ్వంభర'. ఈ మూవీకి బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం.. ఇప్పటి వరకు విడుదల కాలేదు. వీఎఫ్ఎక్స్‌పై ఎక్కువ సమయం కేటాయించడంతో విడుదల విషయంలో ఆలస్యమైంది. జూలైలోనైనా థియేటర్లకు వస్తుందనుకుంటే అదీ కూడా జరగలేదు. ఆ తర్వాత ఈ మూవీకి సంబంధించిన ఎలాంటి అప్‌డేట్ రాలేదు. ఇక ఫ్యాన్స్ కూడా విశ్వంభర చిత్రాన్ని మరిచిపోయేలా ఉన్నారు. కానీ తాజాగా మెగా అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ఇవాళ మెగాస్టార్ బర్త్ డే కావడంతో ఎట్టకేలకు గుడ్ న్యూస్ చెప్పారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విశ్వంభర మూవీ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. దీంతో పాటు ఒరిజినల్ సౌండ్ ట్రాక్ ఆడియో విడుదల చేశారు. దాదాపు ఓ నిమిషం పాటు ఉన్న ఈ ఆడియో మెగా ఫ్యాన్స్‌కు ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో మెగాస్టార్ సరసన త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు.

# 'ఇరుముడి'కి అదిరిపోయే ఓపెనింగ్.. తొలిరోజు కలెక్షన్లు ఇవే



రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇరుముడి'. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద జోరు చూపిస్తోంది. విడుదలైన తొలిరోజుకే భారీ వసూళ్లు రాబట్టింది. ఇండియాలో రూ. 14.80 కోట్లు నెట్ కలెక్షన్లు సాధించినట్లు సాక్‌నిల్క్ నివేదిక అంచనా వేసింది. ప్రపంచ వ్యాప్తంగా రూ. 24.20 కోట్లు గ్రాస్ వసూళ్లు సాధించినట్లు పేర్కొంది.

**ఏపీ తెలంగాణ నుంచే రూ. 15 కోట్లు**

తొలిరోజు 'ఇరుముడి' వసూళ్లలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి రూ. 15కోట్లు గ్రాస్ వచ్చినట్లు అంచనా. కర్ణాటక నంచి 1.5 కోట్లు, తమిళనాడు నుంచి రూ. 34 లక్షలు, మిగతా ప్రాంతాల నుంచి 36 లక్షలు వసూళయ్యాయి. దీంతో ఇండియాలో మొత్తం గ్రాస్ రూ. 17.20 కోట్లకు చేరింది. ఓవర్సీస్‌లో రూ. 7 కోట్ల గ్రాస్ రావడంతో ప్రపంచ వ్యాప్తంగా కలెక్షన్లు రూ. 24.20 కోట్లకు చేరాయి.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512